


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 17.11.2025 | సంపుటి : 2 | సంచిక :283 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Monday | 17.11.2025 | volume : 2 | Issue : 283 | Pages : 8 | Cost : 2/- |

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




## ఐ బొమ్మ, బప్పం వెబ్‌సైట్ల మూసివేత

### నిర్వాహకుడు రవితోనే మూసివేయించిన పోలీసులు

**నిందితుడిపై ఇప్పటి వరకూ 5 కేసులు నమోదు**

**ఓటీటీ సర్వర్లను హ్యాక్ చేసి పలు భాషల సినిమాలు, వెబ్‌సిరీస్‌లను డౌన్‌లోడ్ చేసి.. ఉచితంగా వీక్షించేలా ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్లను రూపొందించాడు. ఎవరికీ దొరక్కుండా అప్పుడప్పుడూ విదేశాలకు వెళ్లి వస్తూ హైదరాబాద్‌లోనే ఉంటున్నాడు. వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్(వీపీఎన్)తో వేర్వేరు ప్రాంతాల నుంచి వెబ్‌సైట్ నిర్వహిస్తున్నట్లు ఏమార్చాడు. విదేశం నుంచి వస్తూ అనూహ్యంగా పోలీసులకు చిక్కాడు. ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి (40)ని కూకట్‌పల్లిలోని అతడి నివాసంలో శనివారం నగర సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. నిందితుడు రవి రూపొందించిన ఐ బొమ్మ, బప్పం పైరసీ సినిమాల వెబ్‌సైట్లను సైబర్‌క్రైమ్ పోలీసులు అతడితోనే డొమైన్ నుంచి తొలగింపజేశారు. నిందితుడిపై ఇప్పటివరకూ 5 కేసులు నమోదయ్యాయి.** – హైదరాబాద్

**రెండు కంపెనీలు.. ప్రేమ వివాహం**

ఏపీలోని విశాఖకు చెందిన ఇమ్మడి రవి హైదరాబాద్‌లోనే ఇంజినీరింగ్ చదివాడు. ముంబయిలో ఎంబీఏ పూర్తిచేశాడు. ప్రేమించి పెళ్లాడిన యువతితో మనస్పర్థలు తలెత్తడంతో నాలుగేళ్ల క్రితం విడిపోయారు. చదువులో చురుగ్గా ఉండే ఇతడు కొంతకాలం

-మిగతా 2 లో..

# మీ అనుభవాలు నమోదు చేయండి

### ఇంజనీర్ల అనుభవాలు మున్ముందు ఎంతగానో తోడ్పడుతాయి

**బుల్లెట్ రైలు ఇంజనీర్లకు ప్రధాని మోదీ సూచన**

**ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టుపై పని చేస్తున్న ఇంజనీర్లతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ఈ పనిలో ఎదురవుతున్న అనుభవాలను నమోదు చేయాలని సూచించారు. తద్వారా భవిష్యత్తులో చేపట్టే ఇలాంటి ప్రాజెక్టులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఇంజనీర్ల అనుభవాలు మున్ముందు ప్రాజెక్టుల ప్రణాళిక, అమలుకు ఎంతగానో తోడ్పడుతాయని చెప్పారు.**



న్యూఢిల్లీ: ప్రధాని మోదీ శనివారం సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటించారు. సూరత్‌లో ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్వే(ఎంఏహెచ్‌ఎస్‌ఆర్) ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీర్లతో మాట్లాడారు. 'బ్లూ బుక్' తరహాలో అనుభవాలను రికార్డు చేయాలని చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు సాకారం కావాలంటే ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు ప్రాజెక్టుపై పనిచేస్తున్న ఇంజనీర్ల సహకారం అవసరమని ఉద్ఘాటించారు.

**బుల్లెట్ రైలు ప్రాజెక్టు అనుభవాలతో 'బ్లూ బుక్'..**

ముంబయి- అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టులో పనిచేస్తున్న ఇంజినీర్లు తమ అనుభవాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. తద్వారా భవిష్యత్తులో ఈ తరహా ప్రాజెక్టుల అమలు సమయంలో ఇవి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులో భాగంగా సూరత్‌లో నిర్మిస్తున్న స్టేషన్‌లో ఇంజినీర్లు, ఇతర సిబ్బందితో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. పనుల పురోగతిని ఆరా తీశారు. దీనికి సంబంధించిన వీడియోను 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. బుల్లెట్ రైలు ప్రాజెక్టులో పొందిన అనుభవాలను నమోదు చేసి, 'బ్లూ బుక్'లా సంకలనం

-మిగతా 2 లో..



## హైడ్రా కమిషనర్ మంచి పనులు చేస్తున్నారు

### రాజకీయాల్లో బూతులు మాట్లాడేవారిని ప్రోత్సహించొద్దు

**మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

**'రాజకీయాల్లో ఉన్న వారు మాట్లాడుతున్న బూతులు తట్టుకోలేకపోతున్నాం. ఇళ్లలో ఉండే ఆడ వారి గురించి ప్రస్తావిస్తున్నారు. ఈ ధోరణి మంచిది కాదు. ఇలాంటి వారికి పోలింగ్ కేంద్రాల్లోనే సమాధానం చెప్పాలి. మొన్నటి ఎన్నికల్లో అసభ్యకరంగా మాట్లాడే నాయకులు ఎవరూ గెలవలేదు. అటువంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించొద్దు' అని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ప్రజలను కోరారు.**

-మిగతా 2 లో..

# టెట్ టెన్షన్

### సుప్రీంకోర్టు తీర్పుతో టెట్ తప్పనిసరి


**రాష్ట్రంలో 45 వేల మందికి పైగా ప్రభుత్వ టీచర్లకు లేని అర్హత**

**ఇన్ సర్వీస్ టీచర్లకు సిలబస్ భయం..**

**పరీక్ష కోసం సెలవులు.. ప్రత్యేక ట్యూషన్లు తీసుకుంటూ తిప్పలు**

**టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ ఉపాధ్యాయ సంఘాలపై ఒత్తిడి**

**ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్ ప్రభుత్వ టీచర్లలో గుబులు పుట్టిస్తోంది. విద్యార్థులకు పాఠాలు చెప్పి, పరీక్షలు నిర్వహించే టీచర్లు తాము పరీక్ష రాయాలంటే భయపడుతున్నారు. సర్వీస్‌లో ఉన్న టీచర్లు కూడా టెట్ రాయాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. అయితే, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 45 వేలకుపైగా ఉపాధ్యాయులకు టెట్ అర్హత లేదు. మరో ఐదేళ్లలో రిటైర్ అవుతున్న వారికి మాత్రం టెట్ నుంచి మినహాయింపు ఇచ్చారు.**



హైదరాబాద్, నవంబరు 16 : సాధారణంగా టెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉంటుంది. తాజాగా బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థుల్లోనే తక్కువగా పాసవుతున్నారు. అలాంటిది టీచర్లు దశాబ్దాల క్రితం సర్వీస్‌లో చేరారు. అప్పటి సిలబస్ వేరు. ఇప్పుడున్నది వేరు. విద్యా విధానంలోనే అనేక మార్పులు వచ్చాయి. ముఖ్యంగా విద్యార్థుల సైకాలజీ, నవీన విద్యావిధానం నుంచి టెట్‌లో ప్రశ్నలు ఇస్తారు. వీటిపై ఇన్ సర్వీస్‌లో ఉన్న

-మిగతా 2 లో..



## జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలి

**కేంద్ర ప్రభుత్వ అధికారులకు మంత్రి తుమ్మల సూచన**

హైదరాబాద్: జిన్నింగ్ మిల్లు యాజమాన్యాల సమస్యలను పరిష్కరించాలని, సీసీఐ నిబంధనలను సడలించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కేంద్ర ప్రభుత్వ

-మిగతా 2 లో..

## తెలంగాణ విజన్‌ను ప్రపంచానికి చూపించబోతున్నాం

### గ్లోబల్ సమిట్-2025 ఏర్పాట్లు పరిశీలించిన భట్టి విక్రమార్క

**తెలంగాణ రైజింగ్ విజన్-2047ను గ్లోబల్ సమిట్‌తో ప్రపంచానికి చూపించబోతున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్‌సిటీలో నిర్వహించ తలపెట్టిన గ్లోబల్ సమిట్-2025 ఏర్పాట్లను ఆదివారం పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లపై ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక ఉప ముఖ్యమంత్రికి వివరించారు.**



రంగారెడ్డి : ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు 2047 వరకు తెలంగాణ ఏ విధంగా ఉండబోతుందనే డాక్యుమెంట్‌ను ప్రపంచానికి


-మిగతా 2 లో..

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

**ముగ్గురు మావోయిస్టులు మృతి**

ఛత్తీస్‌గఢ్, నవంబరు 16 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా బెజ్జి, చింతగుప్ప పోలీసు స్టేషన్ల పరిధిలోని తుమ్మలపాడు అటవీ ప్రాంతంలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. తుమ్మలపాడు అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందన్న సమాచారం అందుకున్న డిస్ట్రిక్ట్ రిజర్వ్‌డ్ గ్రూప్స్ (డీఆర్‌జీ) బలగాలు అక్కడకు చేరుకున్నాయి. ఈ క్రమంలో ఇరుపక్షాల నడుమ ఎదురుకాల్పులు జరిగినట్టు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్

-మిగతా 2 లో..



## పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలి

**పంటను అమ్ముకోలేక నష్టాల పాలవుతున్నారు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్: రాష్ట్రంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా.. పత్తి కొనుగోలు తీవ్ర సంక్షోభంలో పడింది. తేమ శాతం, కపాస్ మొబైల్ యాప్‌లో

-మిగతా 2 లో..



## ప్రభుత్వ పనితీరుకు జూబ్లీహిల్స్ గెలుపు నిదర్శనం

**రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ గెలవడం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పట్టణాభివృద్ధి నిధులు రూ.3.60 కోట్లతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలోని 2, 3, 5, 12, 13 వార్డుల్లో పలు అభివృద్ధి పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టారు.**



# ప్రభుత్వ పనితీరుకు జూబ్లీహిల్స్ గెలుపు నిదర్శనం

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది. నిరుపేదలకు ఇళ్లు ఇస్తే కమీషన్లు రావనే మంజూరు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోనే రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. ప్రతి నియోజకవర్గానికి 3,500 తగ్గకుండా ఇళ్లు ఇచ్చాం. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో ఐటీడీఏ పరిధిలోని ప్రతి నియోజకవర్గానికి అదనంగా 1,000 ఇళ్లు మంజూరు చేశాం' అని పొంగులేటి తెలిపారు. ఇల్లెందు పట్టణంలోని అర్హులకు సైతం ఐటీడీఏ ద్వారా ఇళ్లు కేటాయించాలని వేదికపై ఉన్న పీఓ రాహుల్‌ను ఆయన ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రక్తనిల్వ కేంద్రాన్ని ప్రారంభించడంతోపాటు, జేకే కాలనీలో అసంపూర్తిగా నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లు, రాజీవ్‌గృహకల్ప ఇళ్లను పరిశీలించారు. మంత్రి వెంట ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు ఉన్నారు.

# పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్, జిన్నింగ్ మిల్లుల అవినీతి, మిల్లుల గ్రేడింగ్ అంటూ సీసీఐ పత్తిని కొనుగోలు చేయకుండా సాకులు చెబుతోంది. రాష్ట్రంలో 28 లక్షల టన్నుల పత్తిని కొనుగోలు చేయాలనే లక్ష్యం ఉండగా.. నెల రోజుల్లో కేవలం 1.12 లక్షల టన్నుల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు. అకాల వర్షాలతో ఇప్పటికే పంట నష్టపోయి ఇబ్బందులు పడుతున్న రైతులు మిగిలిన పంటను అమ్ముకోలేక నష్టాల పాలవుతున్నారు. దాదాపు 50 లక్షల ఎకరాల్లో పత్తిని పండించిన కర్షకులు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉంటే.. కాంగ్రెస్, భాజపా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, ఎంపీలు ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. పత్తి పంటను కొనుగోలు చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలి" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. కాల్పుల్లో కుంట ఏరియా కమిటీ జన్ మిలీషియా కమాండర్ మడవి దేవా, కిష్టారం ఏరియా కమిటీ ఏసీఎం సోడి గంగి, కుంట ఏరియా కమిటీ ఏసీఎం పొడియం గంగి మృతి చెందినట్టు పోలీసులు ధ్రువీకరిం చారు. వీరి తలలపై ఒక్కొక్కరికి రూ.5 లక్షల వంతున రివార్డు ఉన్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ఇటీవల కుంట ఏఎస్పీ ఆకాషరావ్ గిరిపుంజను హత్య చేసిన ఘటనలో ప్రధాన పాత్ర మడవి దేవాదేనని పోలీసుల కథనం. ఘటనా స్థలంలో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను, 303 రైఫిల్, బీజీఎల్ లాంచర్లు, పేలుడు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు

# మీ అనుభవాలు నమోదు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

చేస్తే.. భవిష్యత్తులో పెద్దఎత్తున ఈ తరహా ప్రాజెక్టులను తీసుకొచ్చే విషయంలో దేశం నిర్ణయాత్మకంగా ముందుకు వెళ్లగలదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. భారత్ పదేపదే ప్రయోగాలు చేయకుండా.. గత నమూనాల నుంచి నేర్చుకున్న విషయాలను ప్రతిబింబించాలన్నారు. ఈ ప్రాజెక్టు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా ముందుకు సాగుతోందని ప్రధాని మోదీకి సిబ్బంది తెలిపారని ప్రధాన మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. "సూరత్‌లో నిర్మాణంలో ఉన్న బుల్లెట్ రైలు స్టేషన్‌ను సందర్శించాను. ముంబయి- అహ్మదాబాద్ హై స్పీడ్ రైలు కారిడార్ పురోగతిని సమీక్షించాను. దేశంలో మొట్టమొదటి బుల్లెట్ రైలు ప్రాజెక్టుపై పనిచేస్తున్న బృందంతో సంభాషించే అవకాశం లభించింది" అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ప్రధాని వెంట రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఉన్నారు.

# బీసీ రిజర్వేషన్లు పార్టీ పరంగా ఇస్తే అంగీకరించం

## బీసీల న్యాయ సాధన దీక్షలో వక్తల స్పష్టీకరణ

**హైదరాబాద్, నవంబరు 16:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ బీసీ ఐకాస ఛైర్మన్ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఆదివారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో 'బీసీల న్యాయ సాధన దీక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, డాక్టర్ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పార్టీ పరంగా ఇస్తే అంగీకరించబోమని స్పష్టం చేశారు. సంబంధిత రిజర్వేషన్ల కోసం ఏడాదిగా పోరాడుతున్నామని.. దీనిపై నెల రోజుల్లో హైకోర్టు తీర్పు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆ తీర్పు బీసీలకు అనుకూలంగా ఉంటుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయస్థానం నుంచి తీర్పు వెలువడక ముందే ఎన్నికలకు వెళ్తే.. పెద్దఎత్తున ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో 45 బీసీ కుల సంఘాలు, 39 బీసీ సంఘాల ప్రతినిధులతో పాటు బీసీ సంఘం నేతలు పాల్గొన్నారు.



# 'బీసీలను నమ్మించి మోసం చేస్తే ఉద్యమమే..'

**హైదరాబాద్, నవంబరు 16:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పార్టీపరంగా ఇస్తే ఒప్పుకొనే ప్రసక్తే లేదని, చట్టబద్ధంగా ఇవ్వాలని తెలంగాణ బీసీ ఐకాస నేతలు డిమాండ్ చేశారు. నమ్మించి మోసం చేస్తే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ కూడలి నుంచి ట్యాంకు బండ్‌పై ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు 'రన్ ఫర్ జస్టిస్' పేరిట భారీ ర్యాలీని నిర్వహించారు. బీసీ ఐకాస కార్యనిర్వాహక అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఐకాస నేత గుజ్జ కృష్ణ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లు పెంచకుండా తొందరపడి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీకి బీసీలు కచ్చితంగా గుణపాఠం చెబుతారన్నారు. వెంటనే అఖిలపక్షంతో సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీకి వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సోమవారం జరిగే క్యాబినెట్ సమావేశంలో దిల్లీకి అఖిలపక్షం తీసుకెళ్లే తేదీని నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ బిల్లుకు కేంద్రం ఆమోదం తెలపాలని, లేకుంటే డిసెంబరు మొదటివారంలో పార్లమెంట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఐకాస నేతలు శ్రీనివాస్ ముదిరాజ్, గణేశ్ చారి, వీరాస్వామి, విక్రమ్ గౌడ్, శ్యామ్ కురుమ, శేఖర్ సగర, మల్లయ్య, శ్రీధర్, శ్రీనివాస్‌గౌడ్, మధు, నిరంజన్ పాల్గొన్నారు.

# మహిళా సాధికారత దిశగా 'దేశం పురోగమనం'

- న్యాయ వ్యవస్థలోకి కూడా వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరుగుదల
- మన రాజ్యాంగం స్థిర రాజ్యాంగం కాదు.. పరిస్థితులకు అనుగుణంగా మార్పు
- ఒక వ్యవస్థ మరో వ్యవస్థలో ఏ రకంగానూ జోక్యం చేసుకోకూడదు
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్



**అమరావతి, నవంబరు 16:** సమానత్వం, మహిళా సాధికారత దిశగా దేశం పురోగమిస్తోందని, అన్ని రంగాల్లో మహిళలు గొప్పగా రాణిస్తున్నారని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ అన్నారు. న్యాయ వ్యవస్థలోకి వచ్చే మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, కింది స్థాయి న్యాయ వ్యవస్థలో మహిళా న్యాయాధికారుల సంఖ్య 60-70 ఉండటం సమానత్వానికి, మహిళా సాధికారతకు నిదర్శనమన్నారు. ఇది దేశ ప్రగతికి శుభ సూచకమని.. దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ పురోగతిని సైతం సూచిస్తోందని ఆయన తెలిపారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆదివారం విజయవాడలో ఓ కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ గవాయ్ ప్రధానోపన్యాసం చేశారు. ప్రజలకు తమ హక్కులపై అవగాహన ఉన్నప్పుడే వాటిని పొందడం సాధ్యమవుతుందని చెప్పారు. ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే పౌరులు న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించే గొప్ప అవకాశాన్ని రాజ్యాంగం కల్పించిందన్నారు. రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభకు అప్పగించే సమయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడిన మాటలు ప్రతి న్యాయ విద్యార్థికి కంఠోపాఠం కావాలని తెలిపారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని ఓ స్థిర పత్రంలా చూడలేదని.. పరిస్థితులు, సమాజ మార్పులకు అనుగుణంగా మారుతూ ఉండాలని ఆకాంక్షించారన్నారు. అందులో భాగంగానే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మన భారత రాజ్యాంగానికి సవరణలు చేస్తూ వస్తున్నామని, అంబేడ్కర్ సైతం ఇదే ఆశించారని తెలిపారు.

### మన రాజ్యాంగం వల్లే అణగారిన వర్గాలకు అవకాశాలు

రాజ్యాంగంలో పేర్కొన్న వ్యవస్థలు ఒక దాంట్లో ఒకటి జోక్యం చేసుకోరాదని, ఒకవేళ జోక్యం చేసుకుంటే ప్రజాస్వామ్యం పేక మేడలా కూలిపోతుందని జస్టిస్ గవాయ్ తెలిపారు. మన రాజ్యాంగం వల్లే ఈ దేశంలో అణగారిన వర్గాల వారు ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్నారన్నారు. ఇందుకు ప్రస్తుత రాష్ట్రపతి, తానే ప్రత్యక్ష ఉదాహరణ అని స్పష్టం చేశారు. గతంలో కేఆర్ నారాయణన్, రామ్‌నాథ్ కోవింద్‌లు రాష్ట్రపతులుగా పనిచేశారని, ఎస్సీ అయిన బాలయోగి లోక్‌సభ స్పీకర్‌గా పని చేశారన్నారు. ఓ ఛాయ్‌వాలా కూడా ఈ దేశ ప్రధాని కాగలిగారంటే అందుకు రాజ్యాంగమే కారణమని ప్రస్తుత ప్రధాన మంత్రి చెప్పారని గుర్తు చేశారు. మొదట దేశమే ముఖ్యమని, దేశ గతి కన్నా ఏదీ, ఎవరూ ముఖ్యం కాదని అంబేడ్కర్ చాలా స్పష్టంగా చెప్పారన్నారు. తాను పుట్టిన అమరావతి (మహారాష్ట్రలో ఉంది) నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి రావడం యాదృచ్ఛికమన్నారు. తాను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయినప్పుడు మొదట అమరావతికే వెళ్లానని, ఇప్పుడు పదవీ విరమణ చేస్తున్న వేళ మళ్లీ అమరావతికే వచ్చానని చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఐఏఎస్‌లతో పాటు ఇతర ఉన్నతాధికారుల పిల్లలకు మంచి విద్యను అభ్యసించే అవకాశం ఉంటుందని, అదే ఓ పేద రైతు బిడ్డకు ఆ అవకాశం ఉండదని చెప్పారు. అందుకే తాను రిజర్వేషన్ల కల్పనలో క్రిమిలేయర్‌ను ప్రామాణికంగా చేసుకోవాలని ఎస్సీ ఉప వర్గీకరణ తీర్పులో స్పష్టంగా చెప్పానని గుర్తు చేశారు. హక్కులు, మహిళా సాధికారిత కోసం జ్యోతిరావు పూలే, సావిత్రీ బాయి ఎంతో పాటుపడ్డారన్నారు.

# ఐ బొమ్మ, బప్పం వెబ్‌సైట్ల మూసివేత

(మొదటిపేజీ తరువాయి)

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేశాడు. అనంతరం గెట్టింగ్ అప్, ఈఆర్ ఇన్ఫోటెక్ పేర్లతో ఐటీ కంపెనీలు ప్రారంభించాడు. కొన్నాళ్లకు వాటిని మూసివేశాడు. 2018 నుంచీ కూకట్‌పల్లిలోని గేటెడ్ కమ్యూనిటీలో ఒంటరిగా ఉంటూ తరచూ విదేశాలకు వెళ్లొస్తున్నాడని స్థానికులు తెలిపారు. కొన్నేళ్ల క్రితం ఓటీటీ సర్వర్లను హ్యాక్ చేసి సినిమాలు, వెబ్‌సిరీస్‌లను పైరసీ చేయడం ప్రారంభించాడు. వాటి కోసం 100కు పైగా వెబ్‌సైట్లను కొనుగోలు చేశాడు. పైరసీ గుట్టు బయటపడి ఒక వెబ్‌సైట్‌ను తొలగించినా మిగిలిన వాటిని ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకునేవాడు. కూకట్‌పల్లిలోని అతడి నివాసంలో పోలీసులు కొన్ని హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో రెండు వేల సినిమాల వరకు ఉండొచ్చని అంచనాకు వచ్చారు. వెబ్‌సైట్లలో సినిమాలు తొలగించినా మరోసారి అప్‌లోడ్ చేసేందుకు హార్డ్‌డిస్క్‌లో నిల్వ చేసినట్టు పోలీసుల ఎదుట రవి అంగీకరించినట్లు సమాచారం. అతడు పైరసీ నెట్‌వర్క్‌ను ప్రపంచస్థాయిలో విస్తరించినట్టు ప్రాథమికంగా గుర్తించారు. యూకే కేంద్రంగా ఇతడి నేతృత్వంలో కొన్ని సాంకేతిక బృందాలు పనిచేస్తున్నట్టు తెలిసింది. నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న హార్డ్‌డిస్క్‌లు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లను పోలీసులు విశ్లేషిస్తున్నారు. ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగా మరికొన్ని కీలక అంశాలు బయటకు వచ్చే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.

### తెరవెనుక కథ ఇది...

పైరసీ రాకెట్ వెనుక అసలు సూత్రధారులు ఎవరనేది తేలాల్సి ఉంది. వెబ్‌సైట్లలో ఉచితంగా కొత్త సినిమా వీక్షించే అవకాశం కల్పించటం వెనుక అసలు మర్మం ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లకు ప్రచారం కల్పించడమేనని పోలీసులు నిగ్గు తేల్చారు. నిందితుడి నెట్‌వర్క్‌ను ఛేదిస్తే మరింత సమాచారం బయటపడుతుందని భావిస్తున్నారు. ఈ నిమిత్తం చంచల్‌గూడ జైలులో ఉన్న రవిని పోలీసు కస్టడీకి తీసుకోనున్నారు.

### ఇమ్మడి రవి అనుచరులు అరెస్టు

అలా పోలీసులు బెట్టింగ్ యాప్స్‌పై దర్యాప్తు చేస్తుండగా.. ఈ ఏడాది సెప్టెంబర్‌లో పైరసీ కంటెంట్‌కు సంబంధించి ఐదుగురు వ్యక్తులు అరెస్ట్ అయ్యారు. వారిలో శివాజీ,ప్రశాంత్ ఉన్నారు. వారిద్దరూ ఇమ్మడి రవికి ప్రధాన అనుచరులుగా పోలీసులు భావిస్తున్నారు. వాళ్లిద్దరూ అరెస్ట్ అనంతరం కూకట్‌పల్లి నుంచి తప్పించుకుని నెలకొకసారి దేశాలు మారుతూ వచ్చాడు. కూకట్ పల్లి నుంచి నెదర్లాండ్, ఫ్రాన్స్, కరేబీయన్ దీవుల్ని అడ్డగా చేసుకొని పైరసీ సైట్లను నిర్వహించాడు. ఐబొమ్మ రవి ప్రస్తుతం భార్యతో విడాకుల కేసులో హైదరాబాద్ కూకట్ పల్లిలోని ఫ్యామిలీ కోర్టుకు హాజరవుతున్నాడు. అదే క్రమంలో తదుపరి విచారణ కోసం అతడు ఫ్రాన్స్ నుంచి కూకట్ పల్లికి రాగా.. రవిని పోలీసులు అరెస్టు చేశారు. రవి ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ వచ్చిన విషయం అతడి దగ్గరి వ్యక్తుల నుంచి పోలీసులకు లీకైందని కూడా ఒక గుసగుస వినిపిస్తోంది.

### 70కి పైగా పైరసీ సైట్లు

కూకట్‌పల్లిలో ఓ ఇంట్లో అతనిని అరెస్టు చేసే సమయంలో వందల సంఖ్యలో హార్డ్ డిస్క్‌లు, ఐబొమ్మ, బప్పం టీవీలో విడుదల చేసేందుకు అప్‌లోడ్ చేసిన కొత్తగా విడుదలైన సినిమాలు, సర్వర్లను మెయింటైన్ చేసేందుకు వినియోగించిన సాఫ్ట్‌వేర్లు కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లను సీజ్ చేశారు. 2018 నుంచి నివాసం ఉంటున్న ఫ్లాట్‌ను కేంద్రంగా చేసుకున్న ఇమ్మడి రవి ఐబొమ్మ,బప్పంటీవీలలో సినిమాలను అప్‌లోడ్ చేసేవారని,కరేబియన్ దీవుల్లో సైతం కార్యకలాపాలు కొనసాగించినట్లు తేలింది. ఐబొమ్మ, బప్పంటీవీలను ప్రధానంగా ఉంచుకొని.. అదనంగా మరో 70కి పైగా ఆపరేట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. వాటి ఆధారాల్ని సేకరించారు.

### పోలీసుల కస్టడీ పిటిషన్‌లో

బెట్టింగ్ యాప్, గేమింగ్ యాప్ సంస్థలతో ఇమ్మడికి రవికి సంత్సంబంధాలు ఉన్నాయి. ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఇమ్మడి రవికి ఎవరైనా సహకరిస్తున్నారా?. డిస్ట్రిబ్యూటర్లు సినిమా కాపీని పలు డిజిటల్ ఛానెళ్లకు ఇస్తుంటారు. ఆ సర్వర్‌లలోకి వెళ్లిమరీ హ్యాక్ చేశాడు. ఎంతో పకడ్బందీగా ఉండే సర్వర్‌లలో ఎలా ఎంటర్ అయ్యాడు? సినిమాని ఎలా కాపీ చేశాడు? ఆ సినిమాని ఎలా పైరసీ చేశారనే విషయాలు వెలుగులోకి రావాలల్సి ఉంది. ఇమ్మడి రవిని కస్టడీలోకి తీసుకొని మరిన్ని వివరాలు సేకరించాలని భావిస్తున్న పోలీసులు సోమవారం నాంపల్లి కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేయనున్నారు. కాగా, అరెస్టు అనంతరం ఇమ్మడి రవిని పోలీసులు నాంపల్లి కోర్టులో హాజరు పర్చగా.. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో అతన్ని చంచల్‌గూడ జైలుకు తరలించారు.



# కాంగ్రెస్‌కు మేలు చేసేలా కవిత వ్యాఖ్యలు

## భారత రాష్ట్ర సమితి విప్ కేపీ వివేకానంద

**హైదరాబాద్, నవంబరు 16:** కాంగ్రెస్‌కు మేలు చేసేలా జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలున్నాయని భారత రాష్ట్ర సమితి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ట్రాప్‌లో పడి కవిత భారత రాష్ట్ర సమితిపై విమర్శలు చేయడమేమిటని ప్రశ్నించారు. "ఎవరి ప్రయోజనం కోసం ఇలా వ్యవహరిస్తున్నారు? కేసీఆర్ కుమార్తెగా కవితను గౌరవిస్తున్నాం.. ఆ గౌరవాన్ని నిలబెట్టుకోవాలి. ఏదైనా మాట్లాడుతామంటే రియాక్షన్ కూడా అదే రీతిలో ఉంటుందన్న విషయాన్ని గుర్తెరగాలి. పదేళ్లు అధికారం అనుభవించినప్పుడు లేని తప్పులు కవితకు ఇప్పుడెలా గుర్తుకు వస్తున్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో ఎలాంటి సంబంధం లేదని చెప్పి.. ఫలితాలు విడుదలైన తర్వాత భారత రాష్ట్ర సమితి నేతలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం సరికాదు. అనేక అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడి కాంగ్రెస్ గెలిచిన విషయం తెలియదా? తాను చేసిన వ్యాఖ్యలపై ఆమె ఆత్మవిమర్శ చేసుకోవాలి" అని వివేకానంద పేర్కొన్నారు.

# హైడ్రా కమిషనర్ మంచి పనులు చేస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

వయోధిక పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయుడు జి.కృష్ణ రచించిన 'అప్పుడు-ఇప్పుడు', సీనియర్ పాత్రికేయుల 'అనుభవాలు-జ్ఞాపకాలు' పుస్తకాల ఆవిష్కరణ సభ ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ పాత్రికేయులు దేశ నిర్మాణంలో క్రియాశీల పాత్ర పోషించాలని కోరారు. రాజకీయ పక్షాలు తమ బాధ్యతను విస్మరించి ఇతరులపై నెపం వేయడం తగదన్నారు. ఆక్రమణలు తొలగిస్తూ హైడ్రా కమిషనర్ మంచి పనులు చేస్తున్నారని చెప్పారు. సోషల్ మీడియాకు జవాబుదారీతనం ఉండే విధంగా సరిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్షుడు దాసు కేశవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, ఎస్.వెంకట నారాయణ, ఉదయవర్లు, రాజశుక తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విజన్‌ను ప్రపంచానికి చూపించబోతున్నాం

(మొదటిపేజీ తరువాయి)

వివరించబోతున్నామని పేర్కొన్నారు. డిసెంబరు 8, 9 రాష్ట్రానికి అత్యంత ముఖ్యమైన రోజులుగా ప్రభుత్వం గుర్తించి ఈ కార్యక్రమం చేపడుతుందన్నారు. రాష్ట్ర ప్రజలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన ప్రాంతమని, అద్భుతమైన వాతావరణంతో పాటు తక్కువ ధరలకే నైపుణ్యంతో కూడిన మానవ వనరులు అందుబాటులో ఉంటాయని గ్లోబల్ సమిట్ ద్వారా ప్రపంచం నలుమూలల నుంచి తరలివచ్చే పారిశ్రామికవేత్తలకు వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు జయేశ్‌రంజన్, సందీప్‌కుమార్ సుల్తానియా, వికాస్‌రాజ్, శశాంక, నర్సింహారెడ్డి, కృష్ణభాస్కర్, ముషారఫ్ అలీ, విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీపీ సునీతారెడ్డి, పలు శాఖల అధికారులతో పాటు నాయకులు కేవెల్ఆర్, ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# టెట్ టెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

### సుప్రీంకోర్టు తీర్పుతో టెట్ తప్పనిసరి

టీచర్లకు అవగాహన తక్కువే. అదీగాక సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న వ్యక్తి కేవలం తన సబ్జెక్టుపైనే దృష్టి పెడతాడు. గణితం కూడా టెట్ సిలబస్‌లో ఉంటుంది. దీంతో ఇతర సబ్జెక్టులు రాయడం ఇబ్బందిగా ఉంటుందని చెబుతున్నారు. మారిన సిలబస్, బోధన విధానాలకు అనుగుణంగానే కొన్నేళ్లుగా ప్రశ్నపత్రాన్ని రూపొందిస్తున్నారు. కొత్తగా టెట్‌కు సన్నద్ధం అవుతున్న యువతకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎక్కువగా ఉంటుంది. ప్రశ్నలను వెతుక్కుని తేలికగా ప్రిపేర్ అవుతారు. సర్వీస్ టీచర్లకు ఈ అవకాశం తక్కువ. ఇవన్నీ సర్వీస్ టీచర్లలో వణుకు పుట్టిస్తున్నాయి.

### టీచర్లకే ట్యూషన్లు:

టెట్ కోసం అనేక మంది టీచర్లు సెలవులు పెట్టారు. తాము పాఠాలు చెప్పిన విద్యార్థుల వద్దే పాఠాలు నేర్చుకోవాల్సిన పరిస్థితి. కొడుకు, కూతుర్ని బతిమిలాడి మరీ ఆన్‌లైన్‌లో సిలబస్ వెతుక్కోవాల్సి వస్తోంది. టెట్‌ను దృష్టిలో ఉంచుకుని కొన్ని కోచింగ్ కేంద్రాలు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తున్నాయి. వీటికి విధిగా హాజరవుతున్నారు. చాలామంది టీచర్లకు ఆంగ్లభాషపై పట్టులేదు. ఆన్‌లైన్ మెటీరియల్స్, తరగతులు ఆంగ్ల భాషలో ఉంటున్నాయి. వీటిని అర్థం చేసుకోవాలంటే కష్టంగా ఉందని చెబుతున్నారు.

### ఈ నెల 29వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ రెండో విడత నోటిఫికేషన్‌విడుదల చేశారు. శనివారం నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ మొదలైంది ఈ నెల 29వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే సంవత్సరం జనవరి 3 నుంచి 31 వ తేదీ వరకు ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించనున్నారు.

### అందరికీ ఒకే సిలబస్

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న టెట్ అర్హత కోసం పరీక్ష రాసే ఉపాధ్యాయులతో పాటు నిరుద్యోగులకు ఒకే విధమైన సిలబస్ అర్హత పరీక్ష ఉండబోతుంది. విద్యా బోధనకు సంబంధించి ఇప్పటికే పలుమార్లు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు మళ్లీ టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలంటే మళ్లీ సిలబస్ చదవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. పాఠశాలల సమయంలో తరగతుల బోధన తప్ప చదువుకునే వీలుండదు. దీంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

# జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

అధికారులకు సూచించారు. సీసీఐ నిబంధనలను వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆయన ఆదివారం కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ కార్యాలయ కార్యదర్శి, ఇతర అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. "సీసీఐ అమలు చేస్తున్న ఎల్1, ఎల్2 నిబంధనలతో రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లర్లు నష్టపోతున్నారు. తేమ శాతం, ఎకరానికి 7 క్వింటాళ్ల పరిమితి నిబంధనలతో రైతులూ అల్లాడుతున్నారు. తుపాను వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులతో రైతులు ఇప్పటికే భారీగా నష్టపోయారు. ఇలాంటి సమయంలో నిబంధనల పేరిట మిల్లర్లను, రైతులను ఇబ్బందులకు గురిచేయడం భావ్యం కాదు. మానవతా దృక్పథంతో కొనుగోలు నిబంధనలను ఎత్తివేసి, జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించే దిశగా సీసీఐ అధికారులను ఆదేశించాలి" అని మంత్రి కోరారు.

నిద్ర పట్టకపోవడం, గుండె దడ, పదిమందిలోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారా ? అయితే మీరు ఫోబియాతో బాధపడుతున్నట్టే. కొన్నాళ్లుగా ఇలాంటి వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. 30 నుంచి 50 ఏళ్లలోపు ఉన్న వారిలో ఈ సమస్య అధికంగా కనిపిస్తోందని, నిర్లక్ష్యం వహిస్తే మానసిక సమస్యల బారినపడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ తరహా సమస్యతో బాధపడుతూ పట్టణ పరిధిలోని మానసిక వైద్య నిపుణుల వద్దకు ప్రతిరోజూ ఇద్దరు, ముగ్గురు రోగులు వస్తున్నారని, గతంలో నెలకు ఐదుకు మించి కేసులు వచ్చేవి కావంటున్నారు.



ఫోబియాను రెండు రకాలుగా చెబుతారు. ఏదైనా వస్తువు, జంతువులు, ఇతర అంశాల పట్ల కలిగే భయం వల్ల వచ్చే దానిని ఇండివిడ్యువల్ లేదా జూ ఫోబియా అంటారు. పదిమందిలోకి వెళ్లేందుకు భయపడినా, గుండె దడ, ప్రతిదానికీ ఆందోళన వంటి లక్షణాలుంటే క్లాస్టరో ఫోబియా అంటారు. ఈ ఫోబియాతో బాధపడుతున్న వారి సంఖ్య ఇటీవల పెరుగుతోందని, దీనికి అనేక అంశాలు కారణమంటున్నారు. వీరిలో ఎక్కువ శాతం స్నేహితులకు దూరంగా ఉండడం, పదిమందితో మాట్లాడితే ఎదుటివారు ఏమనుకుంటారో అని ఆత్మనూన్యతా భావం కలిగి ఉండడం లాంటి సమస్యలు ప్రధానంగా ఉంటాయి.

# ఫోబియా పరేషాన్

- ఇటీవల పెరుగుతున్న బాధితుల సంఖ్య
- 30 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు వారిలో అధికం
- నిద్ర పట్టకపోవడం, గుండె దడ, భయం తదితర లక్షణాలు
- కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు
- సోషల్ మీడియా వినియోగం, మెదడుపై అధిక ఒత్తిడే కారణం
- మైర్మెకోఫోబియాతో గృహిణి మనీష ఉరి వేసుకుని ఆత్మహత్య
- సకాలంలో గుర్తిస్తే చెక్ చెప్పే అవకాశం
- లక్షణాలను గుర్తించి అప్రమత్తం కావాలి

: డాక్టర్.బత్తుల శ్రీధర్, సైకాలాజిస్ట్





### ఇవీ ప్రధాన లక్షణాలు :

క్లాస్ట్రో ఫోబియాతో బాధపడే వారిలో నిద్ర పట్టకపోవడం, గుండెదడ, భయం, ఆందోళన, యాంగ్జైటీ, రెస్ట్ ఊపిరి ఆడకపోవడం, బీపీ పెరుగుతుండడం వంటి లక్షణాలు ఉంటాయి. ఎక్కువ మందిలోకి వెళ్లినా, ఎవరితోనైనా మాట్లాడేందుకు ప్రయత్నించినా ఇటువంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. దీనికి అనేక అంశాలు కారణమని నిపుణులు చెబుతున్నారు. కుటుంబసమస్యలు, ఆరోగ్య, ఆర్థిక ఇబ్బందులు, మెదడుపై అధిక ఒత్తిడి. ఆత్మన్యూనతాభావం, సోషల్ మీడియాను అధికంగా వినియోగించడం వల్ల మెదడుకు విశ్రాంతి లేకుండా చేయడం వల్ల సమస్య బారినపడేస్తుందంటున్నారు. కొందరిలో కుటుంబ నేపథ్యం సైతం కారణమంటున్నారు ఆరోగ్య నిపుణులు.

### ఫోబియా నుంచి బయటపడే మార్గమేదీ ? :

ఈ సమస్య నుంచి బయటపడేందుకు కొన్ని అంశాలు దోహదపడతాయి. యోగా, మెడిటేషన్, మ్యూజిక్ వినడం, మనసుకు ఉత్సాహాన్ని కలిగించే ఆటలాడడం, శారీరక శ్రమ, పుస్తకాలు చదవడం, కొత్త విషయాలను నేర్చుకునేందుకు ఆసక్తి చూపించడం వంటి ఉపకరిస్తాయి. కొన్ని సందర్భాల్లో మందులు, కౌన్సెలింగ్ అవసరమవుతుంది.

### ఫోబియా భయాలు :

- అరాక్నో ఫోబియా- సాలెపురుగులంటే భయం
- సైనో ఫోబియా- కుక్కలంటే భయం
- ఎంటమో ఫోబియా- కీటకాలను చూస్తే భయం
- ఓఫిడియో ఫోబియా- పాములంటే భయం
- మైర్మెకో ఫోబియా- చీమలను చూస్తే భయం
- ఆక్రోఫోబియా- ఎత్తయిన ప్రదేశాలంటే భయం
- అగోరా ఫోబియా- బహిరంగ ప్రదేశాల్లో భయం
- ఆస్ట్రో ఫోబియా- ఉరుములు, మెరుపులు చూస్తే భయం



## మైర్మెకోఫోబియాతో గృహిణి మనీష ఉరి వేసుకుని ఆత్మహత్య :

చీమలు నన్ను బతకనివ్వవు.. నేను వెళ్లిపోతున్నా.... పాపను బాగా చూసుకోండి అంటూ ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మంచిర్యాలకు చెందిన చిందం శ్రీకాంత్, మనీషా (25) దంపతులతో పాటు వారి మూడేళ్ల పాప అనికతో కలిసి అమీన్ పూర్ పురపాలక సంఘం పరిధిలో గల నవ్య కాలనీలో నివాసముంటున్నారు. అయితే మనీషకు చిన్నప్పటి నుంచి చీమలకు భయపడే మైర్మెకోఫోబియా అనే వ్యాధి ఉండడంతో మనీష భర్త శ్రీకాంత్ ఆఫీస్ కు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి రాగా లోపల నుంచి గడియ పెట్టి ఉంది. స్థానికుల సహాయంతో డోర్ పగలగొట్టి చూడగా సీలింగ్ ఫ్యాన్కు మనీషా చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె పక్కనే దొరికిన లేఖలో చీమలు భరించడం తన వల్ల కావడం లేదని, అందుకే చనిపోతున్నానని పేర్కొంది. కూతురు అనికాను జాగ్రత్తగా చూసుకోమని చెప్తూ వదిలి వెళ్తున్నందుకు క్షమించాలని భర్తను వేడుకుంది. అన్నవరం తిరుపతి హుండీలో రూ.1,116 వేయడంతో పాటు ఎల్లమ్మ తల్లికి ఒడి బియ్యం పోయాలని లేఖలో తెలిపింది. ఎప్పుడూ వినని సమస్యతో మహిళ ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా విషాదం నింపింది.





## లక్షణాలను గుర్తించి అప్రమత్తం కావాలి




ఫోబియా లక్షణాలను గుర్తించి వెంటనే అప్రమత్తం కావాలి. కుటుంబ సభ్యులతో కలిసి మానసిక వైద్య నిపుణులు, సైకాలజిస్టులను సంప్రదించాలి. గుండె దడ, నిద్ర పట్టకపోవడం, తీవ్రమైన ఆందోళన వల్ల ఇబ్బంది పడుతూ ఉంటారు. ఎవరికీ చెప్పుకోలేక, బయటకు రాలేక మదనపడుతుంటారు. వారికి వైద్యసహాయం అందించాలి. నిపుణుల సలహా మేరకు కౌన్సెలింగ్ ఇప్పించాలి. లేదంటే తీవ్రమైన మానసిక సమస్యలకు కారణవుతుంది. కొన్నిసార్లు మ్యూజిక్ వినడం, మెడిటేషన్, యోగా ద్వారా సమస్య నుంచి బయటపడే వీలుంది. పోషకాహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, మద్యం, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకపోవడం ఇతర పనుల్లో నిమగ్నం కావడం వల్ల ఈ ఫోబియాలను నుంచి దూరం కావచ్చు.

- డాక్టర్.బత్తుల శ్రీధర్, సైకాలాజిస్ట్







# సామాజిక ఐక్యతే అభివృద్ధికి మూలం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- కార్తీక వనసమారాధనల్లో మంత్రి సందడి





**సత్తుపల్లి/కొత్తగూడెం, నవంబర్ :** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని సత్తుపల్లి, కొత్తగూడెం ప్రాంతాలలో పలు సామాజిక వర్గాలు నిర్వహించిన కార్తీకమాస వనసమారాధన కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదటగా సత్తుపల్లి పట్టణంలోని గౌరీగూడెంలో ఉన్న మామిడి తోటలో జరిగిన రెడ్డి వారి కార్తీక మాస వనసమారాధనలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ... కార్తీక వనసమారాధనలు మనసంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇలాంటి కార్యక్రమాలు సామాజిక ఐక్యతను, కుటుంబ బంధాల అనురాగాన్ని దృఢపరుస్తాయని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు సమిష్టిగా కృషి చేసినప్పుడే ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం సంఘం సభ్యులు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా సత్తుపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం నిర్వహించిన వనసమారాధన కార్యక్రమంలోనూ మంత్రి ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. అనంతరం మంత్రి కొత్తగూడెం రైటర్ బస్తీలో ఆర్యవైశ్య సంఘం నిర్వహించిన కార్తీక మాస వనసమారాధనలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. అక్కడి నుంచి లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రపురం మామిడి తోటకు వెళ్లి అక్కడ జరిగిన రెడ్డి సంఘం వనసమారాధన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని అందరితో కలిసి భోజనం చేశారు. మంత్రి పర్యటన సందర్భంగా ఈ ఈ ప్రాంతాలన్నింటా సందడి వాతావరణం నెలకొంది.





## ప్రధాన నిర్ణయాలకు వేదిక సిద్ధం

- 18న రాష్ట్ర సెంట్రల్ కార్యవర్గ సమావేశం
- సింగరేణి సమస్యలపై కీలక చర్చ
- భవిష్యత్ ఉద్యమాలకు శ్రీకారం



**మణుగూరు, నవంబర్ 16:** ఈ నెల 18వ తేదీ మంగళవారం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘ (టిబిజికెయస్) రాష్ట్ర సెంట్రల్ కార్యవర్గ సమావేశం మణుగూరు ఏరియాలోని పీవీ కాలనీ, జయశంకర్ సార్ కార్యాలయంలో నిర్వహించబడుతుందని మణుగూరు ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సమావేశానికి టిబిజికెయస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అధ్యక్షత వహించనున్నారు. రాష్ట్ర స్థాయి నాయకులు, సెంట్రల్ కమిటీ, సింగరేణి వ్యాప్తంగా ఉన్న బ్రాంచ్ నాయకులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. సింగరేణి ప్రస్తుత పరిస్థితులు, సంస్థ పరిరక్షణ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇంకా పరిష్కారం కాని కార్మిక సమస్యలపై విస్తృతంగా చర్చ జరుగుతుందని ఆయన వెల్లడించారు. కార్మిక హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సంస్థ ప్రగతి కోసం భవిష్యత్ కార్యాచరణను ఈ సమావేశంలో నిర్ణయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇజ్రాయిల్, రామాచారి, మునిగేల నాగేశ్వరరావు, మురళీకృష్ణ, మస్తాన్, పద్దం శ్రీనివాస్, సింగర్ పవన్ కుమార్, బంగారి పవన్ కుమార్, సుద్దాల సంపత్ కుమార్, ముకేశ్ కుమార్, జంగం రాజ్ కుమార్, దిశెట్టి రమేష్ బాబు, చిరుత వెంకటేశ్వర్లు, రవి బాబు, గుగులోత్ రమేష్, సేవా నాయక్, కమటం పరమేష్ కుమార్, ఇమ్రాన్, కళ్యాణ్, నరేష్, రేవన్, కటారి ప్రసాద్, వినయ్ కుమార్, నరేందర్, రేవన్ శ్రీనివాస్, సురేష్, ఇమ్రాన్ ఖాన్, జ్యోతి పాల్గొన్నారు.

## మానవసేవే మాధవసేవ

# పేదలకు అండగా నిలుద్దాం



- తోగ్గుడెంలో 30 కుటుంబాలకు రగ్గులు, దుప్పట్లు పంపిణీ
- సహాయం చేసే చేతులే గొప్పవి అని కొత్వాల సందేశం
- జనహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమం

**పాల్వంచ, నవంబర్ 16:** పాల్వంచ మండలం తోగ్గుడెం గ్రామంలో జనహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలికాలాన్ని దృష్టిలో పెట్టుకొని 30 కుటుంబాలకు రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ "ప్రార్థించే పెదవుల కంటే సాయం చేసే చేతులు మిన్న" అని, ప్రతి ఒక్కరూ పేదవారికి తోడుగా నిలవాలని సూచించారు. జనహిత ఫౌండేషన్ చైర్మన్ బేరా లక్ష్మీ నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సభ్యులు సునీల్, గ్రామస్థులు సోడే సతీష్, కీసర రామ్మూర్తి, భూక్య గిరిప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ శ్రీను, చింతలచెరువు రమేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



## పేదవాడి ఇంటి కల సాకారం

- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు పేదలకు ఆశ
- శ్రీతారాంపురంలో గృహప్రవేశం వేడుక ఘనంగా
- ప్రజల సమస్యలు పరిష్కారంలో కట్టుబడి ఉన్నట్లు జారే హామీ

**ములకలపల్లి, నవంబర్ 16:** అశ్వారావుపేట నియోజకవర్గంలోని ములకలపల్లి మండలం, శ్రీతారాంపురం గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో భాగంగా దుబ్బ బుల్లెమ్మ కుటుంబ గృహప్రవేశ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నిర్వహించారు. పేదవాడికి స్వంత ఇల్లు కలగడం ఎంతో ముఖ్యమైందని, ఆ కలను కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తోందని జారే తెలిపారు. పేదల కోసం ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా చేపట్టడం శ్లాఘనీయమన్నారు. లబ్ధిదారుల ఇల్లు ప్రారంభించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు ఏర్పాటు చేసిన భోజనంలో పాల్గొని, గ్రామ ప్రజలతో మమేకమయ్యారు. గ్రామ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం తాను ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, మిగిలిన కుటుంబాలకూ త్వరలో ఇళ్లు అందేలా ప్రయత్నిస్తానని జారే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్, మాజీ సర్పంచ్ రవి, సురభి రాజేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ నేత కె.నారాయణ మరణం తీరని లోటు

**టీఆర్టీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ధరావత్ రాములు**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ప్రగతిశీల ఉపాధ్యాయ నేత కె.నారాయణ మరణం యావత్ ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని టీఆర్టీఎఫ్ (తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్)రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ధరావత్ రాములు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితమంతా ఉపాధ్యాయుల సంక్షేమం,సమాన హక్కుల కోసం పోరాడిన సమానత్వ వాధి నారాయణ అని తెలిపారు.ఉపాధ్యాయులకు రావల్సిన బకాయిలు, చెల్లింపులు, పదోన్నతులు, హక్కులు తదితర అంశాలల్లో సంఘాలకు అతీతంగా ప్రభుత్వంతో కొట్లాడి, చర్చించి సాధించుకున్నాని గుర్తు చేశారు.ఉపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ తదనంతరం న్యాయవాది వృత్తిని చేపట్టి పేదల పక్షాన నిలబడి,నిస్వార్థంగా సేవలు అందించి తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు.ప్రతి ఒక్కరూ నారాయణ మాస్టర్ ఆశయాలను కొనసాగించాలని కోరుతూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కుటుంబ సభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# యూటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాసరావు, నర్సయ్య

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ఉద్యోగ,ఉపాధ్యాయులకు రావాల్సిన డిఏలు,ఇతర బకాయిలను తెలంగాణ ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టిస్ యూటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ అన్నారు. ఖమ్మం నగరంలోని యూటిఎఫ్ భవన్ లో ఆదివారం కూసుమంచి యూటిఎఫ్ 12 వ మండల మహాసభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు టెట్ లో తప్పనిసరిగా అర్హత సాధించాలనే నిబంధన పై ప్రభుత్వం మినహాయింపు ఇవ్వాలని కోరారు.గత సంవత్సరం చేసిన కులగణన సర్వే రెమ్యూనరేషన్ ఉద్యోగ,ఉపాధ్యాయులకు సంవత్సరం కాలం దాటిన ఇంకా ఇవ్వలేదని,తక్షణమే రెమ్యూనరేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనంతరం యూటిఎఫ్ కూసుమంచి మండల అధ్యక్షులుగా చిలకల శ్రీనివాసరావు,ప్రధాన కార్యదర్శిగా మండవ నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అదే విధంగా ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరాజు,నాగలక్ష్మి,కోశాధికారిగా బాబురావు,ఆడిటర్ గా శ్రీనివాసరావు,కార్యదర్శులుగా నరసింహారావు,వీరబాబు జమీల్ పాషా,పంతు,ఉపేంద్ర,జుబేదా బేగం,తదితరులను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని తెలిపారు.



# వెంకట సాయిని తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహించాలి

- బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్
- అండర్ - 19 అథ్లెటిక్స్ లో అర్హత సాధించడం గర్వకారణం

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** అండర్ -19 విభాగంలో రాష్ట్రస్థాయిలో 6 కిలోమీటర్లు,400 మీటర్లు అథ్లెటిక్స్ పరుగుల్లో రాణించి రజత పథకం సాధించిన వెంకటసాయికి తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ప్రోత్సాహించాలని బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అన్నారు.నేలకొండపల్లి మండలంలోకి బోదులబండ గ్రామానికి చెందిన గండారపు వెంకటసాయిని జాతీయ అండర్ -19 అథ్లెటిక్స్ లో పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించగా బిజెవైఎం మండల అధ్యక్షుడు తంగెళ్ల సతీష్ ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు ఆదివారం శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ వెంకటసాయి ఖమ్మం నగరంలోని నయాబజార్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతూనే హర్యానాలో జరుగబోయే జాతీయస్థాయి అండర్-19 అథ్లెటిక్స్ పరుగు పందెం పోటీ విభాగంలో అర్హత సాధించడం గర్వకారణం అన్నారు.నిరుపేద రజక కులానికి చెందిన వెంకటసాయిని వెన్ను తట్టి ప్రోత్సహిస్తున్న తల్లితండ్రులు గండారపు నాగేశ్వరావు,అన్నపూర్ణ దంపతులకి అభినందనలు తెలిపారు.ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రోత్సహిస్తే జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు,బాజా రామకృష్ణ,మండల నాయకులు సయ్యద్ మోహినూద్దీన్,పిట్టల సూరిబాబు,కందరబోయిన గోపి,దేశబోయిన వేణుబాబు, ఎలిగేటి నర్సింహారావు, కాసాని ఉదయ్, రజక సంఘం మండల నాయకులు గండారపు రామారావు,యువకులు, క్రీడా అభిమానులు పాల్గొన్నారు.



# వికలాంగులకు ట్రై సైకిల్ పంపిణీ

**వాజేడు, రాజముద్రం న్యూస్:** మండల కేంద్రంలో ఏడ్చేర్లపల్లి, కొత్తూరు ఎస్సీ కాలనీలో మంత్రి సీతక్క ప్రోత్సాహంతో ఏఎల్ఐఎంసిఓ సంస్థ ఆధ్వర్యంలో విల్ చైర్లు, ట్రై సైకిల్ పంపిణీ చేశారు. విల్ చైర్స్ ని అర్హూతలైన దివంగులు కర్నే అఖిల్,మంచిర్ల రాకేష్, నక్క మేవాలాల్,లకు వాజేడు ప్రాథమిక ఆఫీసర్ మహేందర్, మాజీ సర్పంచ్ వాసం మల్లేశ్వరి చేతుల మీదుగా అందజేశారు. మంత్రి సీతక్క ఆల్మికో సంస్థ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు

- ఐక్యవేదిక అధ్యక్షులు రాజిడి వెంకట్ రెడ్డి
- సభ్యులందరి ఐక్యత సంతోషాన్ని కలిగిస్తుంది



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** సభ్యులందరూ కార్తీక మాసాన కలిసిమెలిసి వనభోజనాలు చేయడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని పీర్జాదిగూడ నగర ఐక్యవేదిక అధ్యక్షులు రాజిడి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వనభోజన కార్యక్రమం జరిగింది. సభ్యులందరూ నూతన ఉత్సాహంతో కలిసిమెలిసి వనభోజనాలు చేశారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... పీర్జాదిగూడ రెడ్డి ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనభోజనాలు ఆదివారం ఎంతో అద్భుతంగా, ఆనంద ఉల్లాసాలతో విజయవంతంగా పూర్తయ్యాయని అన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రకృతి ఒడిలో స్నేహసమ్మేళనం జరపడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి అసోసియేషన్ సభ్యులు, మహిళలు, యువత, పిల్లలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దల ఆశీర్వాదాలు, యువత పాల్గొనడం, పిల్లల ఆటపాటలతో సందడి నెలకొంది. కమిటీ సభ్యులు ముందుండి చేసిన ఏర్పాట్లు, సభ్యుల సహకారం కారణంగా వనభోజనాలు మరింతగా విజయవంతమైందని తెలిపారు. వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులందరికీ అసోసియేషన్ అధ్యక్షులు రాజిడి వెంకట్ రెడ్డి, కమిటీ సభ్యులు ధన్యవాదములు తెలియచేసారు.

# కాలనీ సభ్యుల సంఘటితంతోనే అభివృద్ధి సాధ్యం

**మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్**

- సౌత్ పంచవటి కాలనీ నూతన కార్యవర్గాన్ని సన్మానించిన సుభాష్ నాయక్
- నూతన అధ్యక్షుడుగా సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా దుర్గ ఎన్నిక






**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** కాలనీ సభ్యులందరూ ఐకమత్యంగా కలిసిమెలిసి ఉంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందని పీర్జాదిగూడ నగర మాజీ కార్పొరేటర్ కేతావత్ సుభాష్ నాయక్ తెలిపారు. ఈ మేరకు 2వ డివిజన్ పరిధిలోని సౌత్ పంచవటి కాలనీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సౌత్ పంచవటి కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గం నూతన అధ్యక్షులుగా సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి దుర్గ, సలహాదారులు బండారి మల్లేష్ , నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు నటరాజ్, సుబ్బారావు, బాపి రెడ్డి, యాదగిరి గౌడ్, నాగరాజు, రమేష్, ఎన్నికయ్యా రు. ఈ సందర్భంగా 2వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్ నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీల కతీతంగా కాలనీ అభివృద్ధి కోసం అందరిని కలుపుకొని కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ గోవింద్, కాలనీవాసులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

# మోకిలతండాలో లలిత హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం

- పేద ప్రజల కోసమే ఉచిత మెడికల్ క్యాంప్
- గ్రామ యువ నాయకుడు వ్యర్థ బాబు నాయక్

**శంకర్‌పల్లి, రాజముద్ర న్యూస్ :** గ్రామంలోని పేద, మధ్యతరగతి ప్రజల కోసమే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని మోకిల తండా యువ నాయకుడు వ్యర్థ బాబు నాయక్ తెలిపారు. శంకర్ పల్లి పట్టణ పరిధిలోని లలిత హాస్పిటల్ వారి సహకారంతో బాబు నాయక్ ఆధ్వర్యంలో, మోకిల తాండ ప్రజల కొరకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఆదివారం రోజు ఉదయం తొమ్మిది గంటలకు మొదలైన ఈ ఉచిత వైద్య శిబిరం సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగింది. గ్రామంలోని మహిళలు, పెద్దలు ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించి వారి వారి సమస్యలను వైద్యులకు వివరించడంతో, డాక్టర్స్ తగిన సూచనలు చేసి ఉచిత మందుల పంపిణీ చేయడం జరిగింది. సుమారు 100 మంది గ్రామ ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరలో వైద్యం అందించినట్లు డాక్టర్స్ తెలిపారు. ఈ సందర్భంగా బాబు నాయక్ మాట్లాడుతూ... ఈ విధంగా గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు చేయడంతో పట్టణ పరిధిలోని ఆసుపత్రులకు వెళ్ళలేని గ్రామ ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని బాబు నాయక్ తెలిపారు. మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడు ఏదైనా చేయగలడని, అందుకే మన పెద్దవాళ్లు ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారని బాబు నాయక్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. నేటి మారుతున్న జీవనశైలిలో మన ఆహార అలవాట్లే మన ఆరోగ్యానికి పెనుముప్పుగా మారిన సంగతి అందరూ దృష్టిలో పెట్టుకొని తగిన విధంగా ఆహార అలవాట్లను మార్చుకోవాలని ఆయన సూచించారు. గ్రామ ప్రజల కోసం తనవంతుగా ఏ విధమైన సహాయ సహకార కావాలన్నా ముందుంటానని బాబు నాయక్ తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిర కార్యక్రమంలో గ్రామ ప్రజలు, లలిత హాస్పిటల్ డాక్టర్ గదీశ్వర్, డాక్టర్ వినోద్, ప్రశాంత్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.





# కామారెడ్డి బి. సి. ఆక్రోశ సభలో సినిమా దర్శకుడు శంకర్



**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** శనివారం జరిగిన 42శాతం బి. సి.సాధన సమితి బి.సి. ఎస్సీ, ఎస్టీ, జె ఏ సి ఆధ్వర్యంలో జరిగిన ఆక్రోష సభలో జై భోలో తెలంగాణ సినిమా , జయం మనదేరా లాంటి ఉద్యమ నేపథ్యం సినిమా ల దర్శకుడు శంకర్ పాల్గొనటం తనదైన శైలిలో మాట్లాడుతూ జనాలను ఉగ్రూతలింగించటం కంటే భిన్నంగా శూద్రులకు సంబంధించిన విషయాలు మాట్లాడటం చరిత్ర చెప్పి ఇప్పుడు ఎందుకు ఉద్యమించాలి ఏ విధంగా ఉద్యమించాలి ఎందుకు రాజ్యాధికారం కావాలి అనేది వివరించిన విధానం చూస్తే మరో ఉద్యమం కామారెడ్డి నుండి పురుడు పోసుకోవటమే కాదు 42 శాతం బి. సి. రిజర్వేషన్ సాధించటం ఎంతో దూరంలో లేదు అని అనుకోవడంలో ఈ మాత్రం అతిశయోక్తి లేదు అనిపించింది.సినిమా దర్శకుడు శంకర్ మళ్ళీ సినిమాలు తీసి ఉన్నత శిఖరాల్లో ఉండాలని కోరుకుందాం.

# గిరిజన లంబాడి సంఘాల నూతన జేపసీ ఏర్పాటు



**భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 16:** కొత్తగూడెం జిల్లా కేంద్రంలో పదహారు నవంబరు రెండు వేల ఇరవై ఐదు న సిఈఆర్ క్లబ్‌లో గిరిజన లంబాడి సంఘాల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో లంబాడి గిరిజన సంఘాలు ఏకగ్రీవంగా కొత్త జేఏసీని ఏర్పాటు చేసి చైర్మన్‌గా ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్‌ను ఎన్నుకున్నాయి. అనంతరం లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, రిజర్వేషన్లు, అభివృద్ధి, స్వాభిమాన పరిరక్షణ కోసం సమగ్రంగా పోరాటం చేస్తామని తెలిపారు. జీఓ మూడు స్థానంలో కొత్త జీఓ సాధన కోసం ఉద్యమం చేస్తామని, విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో గిరిజన జనాభా ఆధారంగా అవకాశాలు కల్పించేలా పోరాడతామని చెప్పారు. గోర్ బోలి భాషను రాజ్యాంగంలోని ఎనిమిదవ అనుబంధ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బంజారా భవనం నిర్మాణం, సేవాలాల్ మందిర నిర్మాణానికి మూడెకరాల స్థల కేటాయింపు, పిసా, అటవీ హక్కుల చట్టం పగడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భద్రాచలం ఆలయ కమిటీ చైర్మన్ పదవిని గిరిజనులకు కేటాయించాలని, పాల్వంచ పెద్దమ్మ తల్లి ఆలయం కమిటీ బాధ్యతలు స్థానిక గిరిజనులకు అప్పగించాలని సూచించారు. జిల్లాలోని షెడ్యూల్ ప్రాంతాల్లో జడ్పీ చైర్మన్, జెడ్పీటీసీ పదవులను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలనే లక్ష్యంతో జేఏసీ పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు. చైర్మన్‌గా ఎన్నుకున్నందుకు గిరిజన సంఘాల నాయకులందరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ సమావేశంలో నాయకులు న్యాయవాది ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ నాయక్, టిటిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు డి సురేష్ నాయక్, గోర్ బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, బోడ లాలు నాయక్, భట్టు జుంకీలాల్, జివిఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి మూడ్ బాలాజీ నాయక్, వెంకటేశ్వర్లు, లావూరి శ్రీనివాస్, భద్రంగి నాయక్, మోహన్ నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు భూక్య రవి రాథోడ్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలాజీ నాయక్, న్యాయవాది ఎల్ రమేష్, పూర్ణచందర్ నాయక్, బిఎస్ఎన్ఎల్ సంఘం సక్రు, టిటిటిటీఎఫ శంకర్ నాయక్, కిషన్, మాలు, పండిత్ పరిషత్ సంఘం రాంసింగ్, టిపిటిపి హరిలాల్, గోర్ సిక్వాడీ శ్రీను, గోర్ సేన నాగేశ్వరరావు, తేవా హతీరామ్, సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి భూక్య శ్రీను నాయక్, శ్రీను నాయక్, సేవాలాల్ బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబునాయక్, వెంకటేష్, నాగరాజు నాయక్, మహిళా నాయ కురాలు నందిని బాయి, గోర్ సిక్వాడీ నాయకులు బొజ్జ నాయక్, శ్రీను నాయక్, వీరన్న నాయక్, సేవ్య నాయక్, రవి భాస్కర్, మోతీలాల్, లచ్చు, హరి నాయక్ పాల్గొన్నారు.





## చదరంగం క్రీడాకారిణి భవ్యశ్రీని సన్మానించిన ఐఎఫ్ఎల్ సంస్థ

**పారితోషికం కింద పదివేలు అందచేసిన ఎండి బొమ్మగాని బాలకృష్ణ**

**అశ్వారావుపేట, నవంబర్ 16 :** వ్యవసాయ రంగంలో సేవలందిస్తూ, రైతులను పెట్టుబడులకు ప్రోత్సహిస్తూ స్థిరమైన రాబిడికి చర్చలు జరపటం.సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుంటున్న ఐ ఎఫ్ ఎల్ గ్రీన్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం జంగారెడ్డిగూడెం లో రివిజినల్ కార్యాలయం నందు మేనేజింగ్ డైరెక్టర్ బొమ్మ గాని బాలకృష్ణ ఆధ్వర్యంలో చదరంగం క్రీడాకారిణి భవ్య శ్రీలక్ష్మిని వారి తల్లిదండ్రులు అయినటువంటి కేశిబోయిన వీరాంజనేయులు రమాదేవి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ బొమ్మగాని బాలకృష్ణ మాట్లాడుతూ చదరంగంలో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతూ అశ్వారావుపేట ప్రాంతానికి గుర్తింపు తెచ్చిన భవ్యశ్రీ లక్ష్మీ మరిన్ని విజయాలు సాధిస్తూ మంచి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఈనెల 20వ తారీఖున జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో కూడా విజయం సాధించాలని మన ప్రాంతానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు.మా సంస్థ ప్రత్యేక అభినందనలతో పాటు పారితోషికంగా రూ.10,000 రూపాయలను ఆమెకు అందజేస్తున్నామని తెలిపారు. మా సంస్థ జూన్ 15, 2021లో స్థాపించబడిన నాటి నుండి వ్యవసాయ అభివృద్ధితో పాటు సామాజిక బాధ్యతా కార్యక్రమాల్లో కూడా ప్రత్యేక గుర్తింపు సంపాదించిందని ప్రతి సంవత్సరం క్రీడల ప్రోత్సాహం, మెడికల్ క్యాంపులు, విద్యార్థులకు స్ఫూర్తిదాయక కార్యక్రమాలు, రాష్ట్ర–జాతీయ స్థాయి క్రీడాకారుల్ని ప్రోత్సహించడం మా ఐ ఎఫ్ ఎల్ సంస్థ యొక్క ప్రత్యేకత అని తెలిపారు .ఈ సందర్భంగా అశ్వారావుపేటకు చెందిన సంస్థ డైరెక్టర్ అయినటువంటి ఎస్.కె అబ్దుల్ రెహమాన్ బాబా మాట్లాడుతూ "గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభలను ప్రోత్సహించడం మా బాధ్యత అని భవ్య శ్రీలక్ష్మి వంటి క్రీడాకారులు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలి. మా వంతు సహకారం ఎప్పుడూ ఉంటుంది" అని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీనరీని పెంపొందించటమే మా ప్రధాన లక్ష్యమని ఆ విధంగా రైతులను, ప్రజలను, విద్యార్థులను యువతీ యువకులను ప్రోత్సహించటం మా ప్రధాన విధి అని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.సన్మాన కార్యక్రమంలో ఐ ఎఫ్ ఎల్ గ్రీన్ ప్రొడ్యూసర్ కంపెనీ డైరెక్టర్లు ఎస్.కె అబ్దుల్ రెహ్మాన్ బాబా, సయ్యద్ మహబూబ్, ఎస్.కె పాషా, అత్తిలి వీరబాబు, ఎస్.కె ఇక్బాల్, జొన్నలగడ్డ కాంతారావు, ఎస్.కె ఖలీల్ భాష, రవికుమార్, జీ వరలక్ష్మి మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## రాజాపురం విషాద కుటుంబాన్ని ఓదార్చిన మంత్రి పొంగిలేటి, ఎమ్మెల్యే జారే

**అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 16:** అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురం గ్రామంలో మంత్రి స్థాయి సందర్శనతో వాతావరణం మరింత భావోద్వేగభరితమైంది. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మాజీ ఎంపీటీసీ రామిరెడ్డి తమ్ముడు మల్లారెడ్డి ఇటీవల మృతి చెందడంతో కుటుంబం దుఃఖసంద్రంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రివర్యులు పొంగిలేటి శ్రీనివాసరెడ్డి, అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం ప్రత్యేకంగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు.ముందుగా మల్లారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించిన మంత్రి పొంగిలేటి మరియు ఎమ్మెల్యే జారే, అనంతరం రామిరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి దుఃఖాన్ని పంచుకున్నారు. కుటుంబానికి ధైర్యం చెప్పుతూ%ా%"ఏ కష్టంలోనైనా మీతోనే ఉంటాం, ప్రభుత్వం తరపున పూర్తిస్థాయి సహకారం అందుతుంది" అని భరోసా ఇచ్చారు.రామిరెడ్డి కుటుంబం పట్ల గ్రామ ప్రజలు చూపించిన ప్రేమాభిమానాలు, నేతలు తెలిపిన సానుభూతి ఈ కార్యక్రమాన్ని మరింత భావోద్వేగభరితంగా మార్చాయి. కుటుంబ సభ్యులు మంత్రి%–%ఎమ్మెల్యేల సందర్శనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు పాల్గొని రామిరెడ్డి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## సిపిఐ శతాబ్దపు జ్వాలకు ప్రజా శక్తి తోడవాలి

- వందేళ్ల చిరస్మరణీయ పోరాట సంప్రదాయానికి గర్వకరమైన వందనం
- డిసెంబర్ 26 మహాసభకు ప్రజలు వేలాదిగా తరలి రావాలన్న పిలుపు

**అశ్వాపురం, నవంబర్ 16:** అశ్వాపురం మండలంలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు నేతృత్వం లో ఇంటింటికీ ప్రజాప్రచారం ఘనంగా సాగింది. సిపిఐ కార్యకర్తలు గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శిస్తూ కరపత్రాలు పంచడం, శతాబ్ది బహిరంగ సభ కోసం విరాళాలు సేకరించడం వంటి కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సిపిఐ శతాబ్దపు చరిత్రను ప్రజలకు వివరించారు. అశ్వాపురం మండలంలోని ప్రజలు డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ముగింపు బహిరంగ సభకు భారీ ఎత్తున తరలి రావాలని కమటం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు.ఈ మహాసభ కేవలం పార్టీ కార్యక్రమం మాత్రమే కాదు దేశవ్యాప్తంగా వందేళ్ల ప్రజా పోరాటాలకు జయహో చెప్పే చారిత్రాత్మక సాక్ష్యం అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు: సిపిఐ మండలం సహాయ కార్యదర్శులు కమటం వీరన్న, దంతాల జగదీష్, కమటం మనోజ్, బుర్రి దేవేందర్, కాశబోయిన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# జనం మెచ్చిన మట్టి బిడ్డ వెంకన్నబాబు

- బలహీన వర్గాల నుండి ప్రజానాయకుడిగా ఎదుగుతున్న నేత
- మెచ్చా మార్గదర్శకత్వంతో బిఆర్ఎస్‌లో కీలక బాధ్యతలు
- ప్రజల ఆశీర్వాదాలతో సేవా పథంలో అడుగులు దూకుడు



**అశ్వారావుపేట, నవంబర్ 16:** సహనశీలి.. గుణవంతుడు.. అందరివాడు.. సాధారణ కుటుంబంలో పుట్టి, బలహీన వర్గాల జీవనయాత్రను సమీపంగా చూసి, ప్రజా సమస్యలను అర్థం చేసుకుని, వాటి పరిష్కారానికి అంకితమవాలని సంకల్పించిన వ్యక్తి జుజ్జూరు వెంకన్నబాబు. ప్రజలతో కలిసిపోయే స్వభావం, అందరినీ ఆలింగనం చేసుకునే హృదయం, వాడవాడలా తిరిగి సేవచేయాలనే తపనుఇవి ఆయనను గ్రామంలోనే కాకుండా మండలస్థాయిలో కూడా ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయి. తెలుగుదేశం పార్టీ ఆరాటం నుంచి తన ప్రజా ప్రయాణం మొదలుపెట్టినా ప్రజల అభీష్టం, పల్లెల్లోని సమస్యలపై పరిష్కారం చూపాలన్న తన తపన ఆయనను టిఆర్ఎస్ బాట వైపు మళ్లించింది. బిఆర్ఎస్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా, పార్టీ బలం కావాలనే ఉద్దేశంతో తిరిగి గులాబీ జెండాకింద తన సేవలను అంకితం చేశారు.తిరుమలకుంట గ్రామానికి చెందిన బీసీ బిడ్డ జుజ్జూరు వెంకన్నబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పనిచేసి, ఫిర్యాదులు విని పరిష్కారాలు చూపుతూ, పేదల గుమ్మానికి వెలుగు తీసుకువచ్చే వ్యక్తిగా పేరు పొందారు. బిఆర్ఎస్‌లో రేగా ప్రకటనతో, మెచ్చా ఆశీస్సులతో, పార్టీ నాయకుల పూర్తి ప్రోత్సాహంతో ఆయనకు కన్వీనర్ హోదా లభించింది. ఈ బాధ్యతను అత్యంత వినయంతో, సేవాభావంతో స్వీకరించారు."పదవి అనేది గౌరవం కాదు బాధ్యత. ప్రజల కోసం చేసే పనులే అసలు ఎదుగుదల" అనే ఆయన మాటల్లో ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధత స్పష్టంగా కనిపిస్తుంది.కొత్త బాధ్యతలు చేపట్టిన వెంటనే గ్రామంలో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, వాటిని పరిష్కరించేందుకు పార్టీతో అనుసంధానమై పని చేస్తూ జనం మెప్పును పొందుతున్నారు. బిఆర్ఎస్ కార్యకర్తలు మాత్రమే కాదుగ్రామస్తులు, యువత, మహిళలు కూడా ఆయనకు ఆశీర్వాదాలు అందిస్తున్నారు. "మా ఊరి బిడ్డ మా నాయకుడు" అనే భావనతో ప్రజలు వెంకన్నబాబుపై నమ్మకం ఉంచుతున్నారు.అవసరం వచ్చినప్పుడు ముందుండే ధైర్యం, అవసరం లేనప్పటికీ వెనుకుండకుండా సాయం చేసే మనసుఈ రెండూ ఆయనను ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయి. ఇకపై మరింత దీక్షతో, మరింత కృషితో, గ్రామాభివృద్ధి కోసం, బిఆర్ఎస్ బలోపేతం కోసం, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా పని చేయడానికి సంకల్పించారు.ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడే నిజమైన నాయకుడు ఈ మాటను నిజం చేస్తూ జుజ్జూరు వెంకన్నబాబు ముందుకు సాగుతుండటంతో, బిఆర్ఎస్ శ్రేణులు మరియు గ్రామ ప్రజలు అందరూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.వెంకన్నబాబు నాయకత్వ ప్రయాణం విజయాలతో నిండాలిప్రజల ఆశీర్వాదం ఎల్లవేళలా తోడుండాలి.

# సృజన వెలుగులు

- గ్రంథాలయ వారోత్సవాల్లో చిత్రలేఖన పోటీలు
- 200 మంది విద్యార్థుల పాల్గొనడం
- గ్రంథాలయాలపై మక్కువ పెరగడం ఆనందకరం



**భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 16:** 58వ జిల్లా గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మూడవ రోజు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం లక్ష్యంగా వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా



మాట్లాడుతూ నేటి ఇంటర్నెట్–మొబైల్ నేపథ్యం మధ్య కూడా విద్యార్థులు గ్రంథాలయాలపై ఆసక్తి చూపడం ఎంతో ఆనందకరమని అన్నారు. బాల్యతరం నుంచి భావితరాల వరకు గ్రంథాలయాలు పునాది వంటివని, వారోత్సవ కార్యక్రమాలు పిల్లల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. పాఠశాలలు కూడా విద్యార్థులను ఇలాంటి కార్యక్రమాలకు ప్రోత్సహించాలని ఉపాధ్యాయులను కోరారు.ఈ పోటీల్లో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు చిత్రించిన చిత్రాలను డ్రాయింగ్ టీచర్ ఆంథోనీ ప్రభాకర్, అక్షయ్ స్కూల్ ప్రిన్సిపల్, గ్రంథపాలకురాలు జీ.మణి మృదుల పర్యవేక్షించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహంతోనే విద్యార్థులు ఇంత ఉత్సాహంగా పాల్గొన్నారని గ్రంథాలయం తరపున ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో గ్రంథపాలకులు మధుబాబు, రుక్మిణి, సబిత, అలాగే చుంచుపల్లి మండలంలోని వివిధ పాఠశాలల ఇన్చార్జి హెచ్ఎంలు, తల్లిదండ్రులు, పాఠకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎర్రజెండా పోరాటాలకు ప్రజా ఆశీర్వాదం అవసరం

- పేదల భవిష్యత్తు కోసం శతాబ్దం నిండా సాగిన సీపీఐ పోరాటయాత్ర
- అశ్వాపురం గ్రామాల్లో మళ్లీ మళ్లీ వినిపిస్తున్న ఎర్రజెండా పిలుపు
- ఖమ్మంలో శతజయంతి మహాసభకు భారీ జనస్రవంతి లక్ష్యం



**అశ్వాపురం, నవంబర్ 16:** శనివారం సాయంత్రం అశ్వాపురం మండలంలోని అమీర్ధ గ్రామ వీధుల్లో సిపిఐ అశ్వాపురం మండలం కార్యదర్శి అనంతనేని సురేష్ నేతృత్వంలో కరపత్రాల పంపిణీ, విస్తృత ప్రజాప్రచారం జోరుగా సాగింది. గ్రామస్తులతో మాట్లాడుతూ ఆయన వివరించారుపేదల సమస్యల కోసం, కార్మికుల హక్కుల కోసం, కర్షకుల భద్రత కోసం శతాబ్దం నిండా కమ్యూనిస్టు పార్టీ పోరాట జ్యోతి ఆరలేదని. సురేష్ చెప్పిన సంగతుల్లో హృదయానికి హత్తుకునే అంశయ "దున్నేవానికి భూమి" అన్న నినాదంతో వేలాది ఎకరాలను దొరల గడీల నుంచి పేదల చేతుల్లో ఉంచిన చరిత్ర సీపీఐ నిర్మించిందని చెప్పారు.తెలంగాణ సాయుధ పోరాటం కేవలం అధ్యాయం కాదు పేదల భూమి హక్కుల కోసం ప్రజా చరిత్రలో రగిలిన ఎర్రజ్వాల అని గుర్తుచేశారు.అధికారం లేకున్నా 100 ఏళ్లుగా ప్రజల మనసుల్లో నిలిచే పార్టీ కావడం సీపీఐ ప్రత్యేకత అని వివరించారు.ఇటీవలి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో ఆయన ప్రజలకు మరో పిలుపునిచ్చారు.డిసెంబర్ 26న ఖమ్మం నగరంలో జరుగనున్న సీపీఐ శతజయంతి ముగింపు మహాసభకు 40 దేశాల ప్రతినిధులు, ఐదు లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చే భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. మణుగూరు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున ఖమ్మం చేరి ఈ చారిత్రక సభలో భాగస్వాములు కావాలని, ఇది కేవలం ఒక సభ కాదు.. ప్రజా హక్కుల పునరుద్ధరణకు నిచ్చెనలాంటి ఉద్యమ సమాహారమని పిలుపునిచ్చారు. అశ్వాపురం, అమీర్ధ, పరిసర గ్రామాల్లో సీపీఐ నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ, రానున్న మహాసభకు ప్రజాదరణ పెంచే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజలు ఎర్రజెండా భావజాలాన్ని అర్థం చేసుకుని కలిసి ముందుకు రావాలని వారు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలోసిపిఐ మండలం సహాయ కార్యదర్శులు ఎడెల్లి కమలాకర్, తెల్లం వెంకటరమణ, బేతం ప్రభాకర్, ఇరుగు శ్రీకాంత్, కంగాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాద బీమాలో సింగరేణి దేశానికే ఆదర్శం

- కోటి రూపాయల బీమా చెక్కులు పంపిణీ
- ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు గట్టి భరోసా
- తేనెటీగల పెంపకం ద్వారా మహిళలకు ఆర్థిక బలం

**భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 16:** రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు సింగరేణి సంస్థ అమలు చేస్తున్న కోటి రూపాయల ప్రమాద బీమా పథకం ఇప్పుడు దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని సింగరేణి కంపెనీ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం, ఐఆర్ఎస్ పేర్కొన్నారు. ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల కుటుంబాలకు గరిష్ట భరోసా అందించాలన్న దృక్పథంతో ఈ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు.ఆదివారం నాడు సింగరేణి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియాకు చెందిన మహమ్మద్ అబ్దుల్ అజీమ్ కుటుంబానికి కోటి రూపాయల బీమా చెక్కు, బట్టు రాజేశ్వరరావు కుటుంబానికి 40 లక్షల బీమా చెక్కు అందజేశారు. అజీమ్ 25.02.2025న ఖమ్మంలో జరిగిన ప్రమాదంలో, రాజేశ్వరరావు 02.02.2024న రైలు ప్రమాదంలో మరణించినట్లు వివరించారు.స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కార్పొరేట్ శాలరీ అకౌంట్లు ఉన్నందున ఉద్యోగులందరికీ బ్యాంక్‌తో ప్రత్యేక అవగాహన కుదుర్చుకుని ఈ భారీ బీమా అమలు చేశామని తెలిపారు. దేశంలోని మరే రాష్ట్రంలోనూ, మరే ప్రభుత్వ సంస్థలోనూ ఉద్యోగులకు ఇంత పెద్ద మొత్తంలో ప్రమాద బీమా అమలు చేయడం సింగరేణే మొదటిసారి అని చెప్పారు. ఈ పథకాన్ని ఆదర్శంగా తీసుకుని అస్సాం, ఉత్తరప్రదేశ్, కోల్ ఇండియా వంటి సంస్థలు కూడా అమలులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.అనుకోని ప్రమాదం కుటుంబాలను ఒక్కసారిగా ఆర్థికంగా కుదేలు చేస్తుందని, అలాంటి సందర్భాల్లో కనీసం బీమా రూపంలో భరోసా అందించాలన్న సంకల్పంతో ఈ పథకాన్ని కొనసాగిస్తున్నట్లు తెలియజేశారు. కాంట్రాక్టు కార్మికులకు కూడా 40 లక్షల వరకు బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కే.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్) గౌతమ్ పోట్రు, ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.తదనంతరం సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా మనబ్ కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ, త్రిపుర సహకారంతో తేనెటీగల పెంపకం శిక్షణ పొందిన మహిళలు సేకరించిన తేనెను ఎన్.బలరాం ఆవిష్కరించారు. స్థానిక మహిళలు ఆర్థికంగా ఎదగడానికి తేనెటీగల పెంపకం గొప్ప అవకాశం అని, సహజసిద్ధంగా లభించే ఈ నాణ్యమైన తేనెకు మంచి మార్కెటింగ్ ఉండేలా సంస్థ సహకారం అందిస్తుందని తెలిపారు. గ్రామాల్లో కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు, స్థానికులకు ఉపాధి అవకాశాలను సృష్టించడం సింగరేణి బాధ్యతలో భాగమని అన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు, జిఎం(పర్సనల్) వెల్ఫేర్ %డ% సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, ఈఈ సెల్ ఏజిఎం మురళీధర్ రావు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఎస్‌బిఐ అధికారులు, తేనెటీగల పెంపకం దారులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## లంకా అజయ్-పూర్ణిమ దాంపత్య వేడుకలో సోయం వీరభద్రం ఆశీర్వాదం

**అశ్వారావుపేట, నవంబర్ 16:** అశ్వరావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట మండలం ధురధపాడు గ్రామంలో ఆదివారం నాడు ఆనందోత్సాహాలతో వివాహ వాతావరణం నెలకొంది. లంకా రమేష్–సునీత దంపతుల కుమారుడు లంకా అజయ్ - పూర్ణిమ వివాహ మహోత్సవానికి అశ్వరావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నేత సోయం వీరభద్రం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.వీరభద్రం నూతన దాంపత్య జీవితం ప్రేమ, పరస్పర గౌరవం, ఆనందంతో నిండాలని ఆశీర్వచనం అందించి శుభాకాంక్షలు తెలపడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. యువ దంపతులు సుసంపన్నమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు.ఈ వివాహ వేడుకకు గంధం శ్రీనివాసరావు, లంకా వినోద్ కుమార్, నవునూరి భవీన్ కుమార్, లంకా కుటుంబ సభ్యులు మరియు గ్రామంలోని పలువురు స్నేహితులు, బంధువులు హాజరై కొత్త జంటకు ఆశీస్సులు అందించారు.గ్రామమంతా ఆనందంతో కళకళలాడిన ఈ వేడుకలో పెద్దలు%–%చిన్నలు కలిసి నూతన దాంపత్యాన్ని ఆశీర్వదించగా, అందరికీ ఆతిథ్యం అందిస్తూ లంకా కుటుంబం ఆత్మీయత చాటింది.

## షాద్‌నగర్ జాగృతిలో కలకలం

- సీనియర్‌లను పట్టించోని నూతన ఇంచార్జి రమేష్?
- సీనియర్ నాయకులకు తెలియకుండానే ప్రెస్ మీట్ నిర్వహణపై ఆగ్రహం
- 17 ఏళ్ల సేవ చేసిన జాగృతి నాయకులు నిర్లక్ష్యంపై మండిపాటు
- పరిస్థితిని కల్వకుంట్ల కవితకు వివరించనున్న సీనియర్ లీడర్లు



**షాద్ నగర్, నవంబర్ 16:** షాద్‌నగర్ తెలంగాణ జాగృతిలో అంతర్గత అసంతృప్తి తెరపైకి వచ్చింది. నూతన ఇంచార్జి సీమల రమేష్ సీనియర్ నాయకులను పట్టించుకోవడంలేదని, కీలక కార్యక్రమాలకు దూరం చేస్తున్నారనే వాపోతున్నారు జాగృతి సీనియర్ శ్రేణులు.జాగృతి జనం బాట కార్యక్రమం సందర్భంగా త్వరలో కల్వకుంట్ల కవిత షాద్‌నగర్‌కు రానున్న విషయం మీద సీనియర్ నాయకులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ప్రెస్ మీట్ నిర్వహించడంపై వారు తీవ్రంగా అభ్యంతరం తెలిపారు. ఈ విధానం పార్టీ సాంప్రదాయాలకు విరుద్ధమని, సీనియర్‌ల పట్ల వివక్ష చూపుతున్నారన్న అభిప్రాయం వ్యక్తం చేశారు.గత 17 సంవత్సరాలుగా తెలంగాణ జాగృతి బలోపేతం కోసం నియోజకవర్గంలోని ఆరు మండలాలలో కమిటీలు ఏర్పాటు చేసి గ్రామ స్థాయిలో పనిచేసిన నేతలను కొత్త ఇంచార్జి పట్టించుకోవడంలేదని మండల స్థాయి నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.నియోజకవర్గంలో జరుగుతున్న ఈ పరిణామాలను త్వరలోనే కల్వకుంట్ల కవితకు వివరించనున్నామని వారు స్పష్టం చేశారు.ఈ ఆందోళనలో పాల్గొన్న వారు:బాలాజీ, ఉదయ్, సునీత, విజయ, లక్ష్మి, సంతోష్, రాజు, రమేష్, శీను నాయక్, పాండు నాయక్ తదితర జాగృతి సీనియర్ నాయకులు.



# సఫారీల స్పిన్ ఉచ్చులో..

# టీమ్ఇండియా విలవిల

**తొలి టెస్టులో అనూహ్య ఓటమి**
**చరిత్ర సృష్టించిన సౌతాఫ్రికా..**
**15 ఏళ్ల తర్వాత భారత్‌లో విజయం**

**సౌతాఫ్రికా క్రికెట్ జట్టు భారత పర్యటనను అద్భుతమైన విజయంతో ఆరంభించింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా టీమిండియాతో జరిగిన మ్యాచ్‌లో 30 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా గెలుపొందింది. 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని సఫారీ బౌలర్లు డిఫెండ్ చేసి అద్భుతం చేశారు. లక్ష్య చేధనలో భారత్ కేవలం 93 పరుగులకే ఆలౌటైంది. ప్రొటీస్ స్పిన్నర్ సైమన్ హార్మర్ నాలుగు వికెట్ల పడగొట్టి టీమిండియాను దెబ్బ తీశాడు. అతడితో కేశవ్ మహారాజ్, జానెసన్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో సంచలన విజయం సాధించిన సౌతాఫ్రికా ఓ అరుదైన రికార్డును తమ పేరిట లిఖించుకుంది. ఈడెన్ గార్డెన్స్ మైదానంలో టెస్టుల్లో లోయెస్ట్ టోటల్ డిఫెండ్ చేసిన జట్టుగా ప్రొటీస్ నిలిచింది. ఇంతకుముందు రికార్డు భారత జట్టు పేరిట ఉండేది. ఈ వేదికలో 1973లో ఇంగ్లండ్‌తో జరిగిన ఓ టెస్టు మ్యాచ్‌లో 192 పరుగులను టీమిండియా కాపాడుకుంది. తాజా మ్యాచ్‌లో 124 పరుగులను డిఫెండ్ చేసుకున్న సౌతాఫ్రికా.. భారత్ ఆల్‌టైమ్ రికార్డును బ్రేక్ చేసింది.**

**కోల్‌కతా :** సొంతగడ్డపై నాణ్యమైన స్పిన్‌ను ఎదుర్కోవడంలో టీమ్ఇండియా మరోసారి ఘోరంగా విఫలమైంది. మూడు రోజుల్లోనే ముగిసిన మొదటి టెస్టులో 30 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో పరాజయంపాలైంది. ఆదివారం 124 పరుగుల ఛేదనలో భారత్ తేలిపోయింది. స్పిన్నర్లు హార్మర్ (4/21), కేశవ్ మహరాజ్ (2/37), మార్‌క్రమ్ (1/5) ధాటికి 35 ఓవర్లలో 93 పరుగులకే ఆలౌటైంది. యాన్సెన్ రెండు వికెట్లు పడగొట్టాడు. మెడ గాయం కారణంగా కెప్టెన్ గిల్ బ్యాటింగ్‌కు దిగలేదు. వాషింగ్టన్ సుందర్ (31) టాప్ స్కోరర్. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 93/7తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా.. 153 పరుగులకు ఆలౌటైంది. బవుమా (55 నాటౌట్) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 159 పరుగులు చేయగా.. భారత్ 189 పరుగులకు ఆలౌటైంది. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత దక్షిణాఫ్రికా.. భారత్‌లో టెస్టు విజయాన్నందుకుంది. రెండో టెస్టు శనివారం గువాహటిలో ఆరంభమవుతుంది.



ఈడెన్‌లో పిచ్ మన స్పిన్నర్లు జడేజా, అక్షర్, కుల్‌దీప్‌లకు సహకరిస్తుందనుకుంటే.. దక్షిణాఫ్రికా స్పిన్నర్ హార్మర్ హీరోగా నిలిచాడు. అతడు పడగొట్టిన 8 వికెట్లే మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశించాయి. అతడే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'. సొంతగడ్డపై గత ఆరు టెస్టుల్లో భారత్‌కు ఇది నాలుగో పరాభవం. గత ఏడాది కివీస్ చేతిలో 0–3తో ఓడిన సంగతి తెలిసిందే. తాజా ఓటమితో టర్నింగ్ పిచ్‌లపై ఆడడంలో మన బ్యాటర్ల సమర్థతపై మరోసారి చర్చ మొదలైంది. భారత బ్యాటర్ల ప్రదర్శన అభిమానులకు పెద్ద షాకే. ఒక్క బ్యాటర్ కూడా సాధికారికంగా ఆడలేకపోయాడు. అదే సమయంలో ఆందోళన కలిగించే మరో విషయమేంటంటే.. ఈ నాలుగు ఓటముల్లోనూ ప్రత్యర్థి స్పిన్నర్లు భారత స్పిన్నర్ల కన్నా మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ ఓటమితో ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కానీ పిచ్‌తో సమస్యేమీ లేదని కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. "పిచ్ దారుణంగా ఏమీ లేదు. అది ఛేదించదగ్గ లక్ష్యమే" అని అన్నాడు. బ్యాటర్ల టెక్నిక్‌కు పరీక్ష ఎదురైందని, స్పిన్‌కు బాగా సహకరించే పిచ్‌పై స్పిన్నర్లను ఎదుర్కోవడంలో మన బ్యాటర్లు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాల్సివుందని చెప్పాడు.

**టీమ్ఇండియా తడబాటు**

లక్ష్యం చిన్నదే అయినా.. బంతి గిర్రున తిరుగుతున్న పిచ్‌పై ఛేదన తేలికని కూడా ఎవరూ అనుకోలేదు. కానీ టీమ్ఇండియా తడబాటు, పరాభవం మాత్రం ఊహించనిదే. అయితే స్పిన్నర్లు భారత్ వెన్నువిరిచినా.. మొదట్లో దెబ్బతీసింది మాత్రం పేసర్ యాన్సనే. మూడు ఓవర్లయినా కాకముందే అతడు ఓపెనర్లిద్దరినీ వెనక్కి పంపాడు. ఇన్నింగ్స్ నాలుగో బంతికే జైస్వాల్‌ను ఔట్ చేసిన అతడు. మూడో ఓవర్లో రాహుల్‌ను పెవిలియన్ బాట పట్టించాడు. షార్ట్ బంతిని ఆడిన జైస్వాల్, వికెట్‌కీపర్ వెరీన్‌కు చిక్కాడు. రాహుల్ కూడా వెరీన్‌కే క్యాచ్ ఇచ్చాడు. ఒక్క పరుగుకే రెండు వికెట్లు కోల్పోయిన భారత్‌కు ఆ తర్వాత కోలుకోవడం కష్టమైంది. స్పిన్నర్ల జోరు మొదలు కావడంతో క్రీజులో నిలవడానికి అవస్థ పడింది. ఒక్క సుందర్ మాత్రమే కాస్త ప్రతిఘటించగలిగాడు. హార్మర్ తన స్పిన్ మాయాజాలంతో భారత్ పతనాన్ని శాసించాడు. హార్మర్ బౌలింగ్‌లో



భారీ షాట్ ఆడే ప్రయత్నం చేసిన జురెల్ (13).. బౌండరీ వద్ద బోష్‌కు చిక్కాడు. హార్మర్ బౌలింగ్‌లోనే పంత్ (2) ఓ పేలవ షాట్‌తో రిటర్న్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరడంతో భారత్ 38/4తో చిక్కుల్లో పడింది. ఆ దశలో జడేజా (18)తో కలిసి సుందర్ భారత్‌కు ఆశలు కల్పించాడు. 64/4తో భారత్ కాస్త కోలుకున్నట్లనిపించింది. కానీ జడేజాను వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడం ద్వారా టీమ్ఇండియాను హార్మన్ మళ్లీ దెబ్బతీశాడు. అంతే.. ఆ తర్వాత భారత్ నుంచి ఎలాంటి ప్రతిఘటనా లేదు. పతనం వేగంగా సాగింది. వికెట్లు టపటపా నేలకూలాయి. అక్షర్ (26) కాస్త ధాటిగా ఆడినా.. అతడి ప్రయత్నం ఏమాత్రం సరిపోలేదు. కాస్త పోరాడిన సుందర్.. పార్ట్‌టైమ్ ఆఫ్‌స్పిన్నర్ మార్‌క్రమ్‌కు దొరికిపోయాడు. మార్‌క్రమ్ బంతిని డిఫెండ్ చేయబోయిన సుందర్.. ఎడ్జ్‌తో తేలికైన క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత కుల్‌దీప్ (1)ను హార్మర్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోగా.. మహరాజ్ బౌలింగ్‌లో అక్షర్ ఔటయ్యాడు. సిరాజ్ (0) కూడా మహరాజ్ బౌలింగ్‌లోనే నిష్క్రమించాడు. అతడు తొమ్మిదో వికెట్‌గా వెనుదిరిగాడు. గిల్ గాయం కారణంగా బ్యాటింగ్‌కు రాకపోవడంతో అక్కడే టీమ్ఇండియా ఇన్నింగ్స్ ముగిసింది.

## షూటర్ ధనుష్‌కు తెలంగాణ సర్కార్ భారీ నజరానా

టోక్యో వేదికగా జరుగుతున్న డెఫ్లంపిక్స్‌లో హైదరాబాద్‌కు చెందిన షూటర్ ధనుష్ శ్రీకాంత్ అదరగొట్టాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో శ్రీకాంత్ స్వర్ణ పతకం కైవసం చేసుకున్నాడు. దనుష్ ఫైనల్లో 252.2 పాయింట్లతో అగ్రస్దానంలో నిలిచాడు. తద్వారా డెఫ్లంపిక్స్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగం ఫైనల్లో అత్యధిక పాయింట్ల సాధించిన షూటర్‌గా శ్రీకాంత్ వరల్డ్ రికార్డు సృష్టించాడు. సూరత్‌కు చెందిన మరో షూటర్ మహ్మద్ వానియా 250.1 పాయింట్లతో రజత పతకం సొంతం చేసుకున్నాడు. దీంతో రెండు పతకాలూ భారత్‌కే దక్కాయి. ఇక ఈ డెఫ్లంపిక్స్‌లో సత్తాచాటిన ధనుష్ శ్రీకాంత్‌కు తెలంగాణ సర్కార్ భారీ నజరానా ప్రకటించింది. స్పోర్ట్స్ పాలసీ ప్రకారం కోటి 20 లక్షలు రూపాయల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి ప్రకటించారు. ఆదివారం (నవంబర్ 16) హన్మకొండ స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభంలో ఈ విషయాన్ని వెల్లడించారు.



## టాప్-2కు సౌతాఫ్రికా..

కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో 30 పరుగుల తేడాతో టీమిండియా పరాజయం పాలైంది. పర్యాటక జట్టు నిర్ధేశించిన 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత్ చేధించలేకపోయింది. 35 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. సౌతాఫ్రికా స్పిన్నర్ సైమన్ హార్మర్ నాలుగు వికెట్లతో టీమిండియా పతనాన్ని శాసించాడు. అతడితో కేశవ్ మహారాజ్, జానెసన్ తలా రెండు వికెట్లు సాధించారు. భారత బ్యాటర్లలో వాషింగ్టన్ సుందర్(31) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కాగా ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో గాయపడి రిటైర్డ్ ఔట్‌గా వెనుదిరిగిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. రెండో ఇన్నింగ్స్‌లో కూడా బ్యాటింగ్‌కు రాలేదు. గిల్ లేకపోవడం కూడా భారత జట్టుకు చాలా నష్టాన్ని కలిగించిందే అని చెప్పాలి.

**నాలుగో స్థానానికి పడిపోయిన భారత్..** ఇక భారత్–సౌతాఫ్రికా తొలి టెస్టు ఫలితంతో వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఓటమితో టీమిండియా డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో మూడో స్థానం నుంచి నాలుగో స్థానానికి పడిపోయింది. భారత్ పాయింట్ల శాతం 54.17గా ఉంది. ప్రస్తుత డబ్ల్యూటీసీ సైకిల్‌లో భారత జట్టు 8 మ్యాచ్‌లు ఆడి నాలుగింట గెలుపొందగా.. మూడింట ఓటమి చవిచూసింది. మరోవైపు ఈ విజయంతో దక్షిణాఫ్రికా(66.7 శాతం) రెండో స్థానానికి దూసుకెళ్లింది. అయితే పీసీటీ పరంగా సౌతాఫ్రికా, శ్రీలంక జట్లు సమంగా ఉన్నాయి. కానీ పాయింట్లు పరంగా మాత్రం లంక(16) కంటే సౌతాఫ్రికా(24) ముందుంజలో ఉంది. అందుకే శ్రీలంక మూడో స్థానంలో కొనసాగుతోంది. ఇక ఆస్ట్రేలియా(100.00) అగ్రస్థానంలో ఉంది. ఈ సైకిల్‌లో ఆస్ట్రేలియా ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌లలోనూ విజయం సాధించింది. సౌతాఫ్రికా ఆడిన 3 మ్యాచ్‌లలో 2 విజయాలు, ఒక్క ఓటమి చవిచూసింది.

రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



## అదితి రావు పేరుతో మోసం.. స్పందించిన నటి

తన పేరు, ఫొటో వినియోగిస్తూ ఓ వ్యక్తి ఫొటోగ్రాఫర్లను మోసం చేస్తున్నాడని, అలాంటి ఫేక్ అకౌంట్ నుంచి జాగ్రత్తగా ఉండాలంటూ నటి అదితి రావు హైదరి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "ఓ వ్యక్తి వాట్సాప్‌లో నా పేరుతోపాటు ఫొటోను ప్రొఫైల్‌గా పెట్టుకుని.. ఫొటోషూట్స్ పేరిట పలువురు ఫొటోగ్రాఫర్లకు మెసేజ్ చేస్తున్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని కొందరు నా దృష్టికి తీసుకొచ్చారు. ఆ మెసేజ్‌లు చేసింది నేను కాదు. ఫొటోషూట్ లాంటి వాటి కోసం ఎవరినైనా కాంటాక్ట్ అవ్వాలన్నా.. నేను వ్యక్తిగత ఫోన్ నెంబరు వాడను. నా టీమ్ ద్వారానే వారిని సంప్రదిస్తుంటా. ఒకవేళ మీకు ఇలాంటి మెసేజ్‌లు వస్తే.. మా ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా తెలియజేయండి" అని విజ్ఞప్తి చేశారు.

## ఈ పాత్ర లేకపోతే కథే లేదు



టాలీవుడ్ యంగ్ హీరోయిన్ కామాక్షి భాస్కర్ల 'మా ఊరి పొలిమేర' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి ఊహించని క్రేజ్‌ను రాబట్టుకుంది. ఆ తర్వాత ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం, రౌడీ బాయ్స్, వీరూపాక్ష వంటి హిట్ చిత్రాల్లో నటించి తన పాపులారిటీని మరింత పెంచుకుని వరుస అవకాశాలు దక్కించుకుంటుంది. ప్రస్తుతం కామాక్షి '12ఏ రైల్వే కాలనీ' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాను నాని కాసరగడ్డ తెరకెక్కించగా.. అల్లరి నరేష్ హీరోగా నటించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సస్పెన్స్ థ్రిల్లర్ నవంబర్ 21న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈక్రమంలో.. తాజాగా, ప్రమోషన్స్‌లో పాల్గొన్న కామాక్షి ఆసక్తికర కామెంట్స్ చేసింది. "నేను ఇందేలో నరేష్‌కు జోడీగా ఆరాధన పాత్రలో నటించాను. ఈ పాత్ర లేకపోతే ఈ కథే లేదు. ఈ సినిమా చూశాక మీ అందరికీ నా పాత్ర గుర్తుండిపోతుంది. విజయ్ సేతుపతి, శ్రీవిష్ణు, సుహాస్.. ఇలా చాలామంది హీరోలు అన్ని రకాల పాత్రలు చేసుకుంటూ వచ్చారు. హీరోయిన్లు అలా ఎందుకు చేయకూడదని ఓ సవాల్‌గా తీసుకుని ఈ పాత్ర చేశాను. ఇకనుంచి అయినా విభిన్న రకాల పాత్రలో పోషించే ప్రయత్నం చేస్తున్నాను. అలా ఈ ఐదేళ్ల నా ప్రయాణంలో చేసిన విరూపాక్ష, పొలిమేర మంచి పేరు తెచ్చిపెట్టాయి. ప్రస్తుతం 'డెకాయిట్' చేస్తున్నను. అలాగే ఓ పెద్ద ప్రాజెక్ట్‌లోనూ భాగం అయ్యాను. త్వరలోనే వివరాలను అధికారికంగా వెల్లడిస్తా. వీటితో పాటు 'పొలిమేర-3' షూటింగ్‌లో కూడా పాల్గొంటున్నాను" అని చెప్పుకొచ్చింది.



టాలీవుడ్ యంగ్ హీరోయిన్ అను ఇమాన్యుయేల్ ఒకప్పుడు కమర్షియల్ చిత్రాల్లో నటించి మెప్పించింది. అయినప్పటికీ పెద్దగా అవకాశాలు రాకపోవడంతో కొద్ది కాలంపాటు సినిమాలకు దూరం అయింది. ఇటీవల మళ్లీ 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రంతో రీఎంట్రీ ఇచ్చింది. ఇందులో రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటించగా.. ఆమె స్నేహితురాలిలాగా అను నటించి తన నటనతో ప్రశంసలు పొందింది. లేడీ ఓరియెంటెడ్ సినిమాగా వచ్చిన 'ది గర్ల్ ఫ్రెండ్' చాలామంది అమ్మాయిలను ఇన్‌స్పైర్ చేస్తోంది. అలాగే కొందమంది మహిళలను కన్నీరు

## ఇప్పటికైనా స్త్రీలను గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నాను : అను ఇమాన్యుయేల్

పెట్టేలా చేస్తూ..ఎలాంటి కష్టం వచ్చినా ఎదుర్కొనే ధైర్యం నింపుతోంది. అను ఇమాన్యుయేల్‌కు ఈ సినిమా కలిసొచ్చిందని చెప్పొచ్చు. మంచి పాజిటివ్ టాక్‌తో పాటు అమ్మడు చేసిన పాత్ర అందరికీ కనెక్ట్ అవుతోంది. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అను పలు ఆసక్తికర కామెంట్స్ చేసింది. "కొంతమంది స్త్రీలు ఇష్టంతోనే ఇంట్లో ఉండిపోయి, తమ పిల్లలను కుటుంబాలను చూసుకుంటారు..అది తప్పు కాదు!! ఉద్యోగం చేయాలి, తమకంటూ గుర్తింపు పొందాలనుకున్నప్పుడు తమ ఇష్టానికి విరుద్ధంగా ఉండిపోతేనే అది తప్పు అవుతుంది. మా సినిమాలో కూడా ఇలాంటివే చూపించాము. అమ్మాయిలకు నచ్చినట్లు ఉండొచ్చు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com